www.flashindianews.com

# ఫ్లాష్ ఇండియా

తెలుగు దినపత్రిక

FLASH INDIA TELUGU DAILY

RNI NO.APTEL/2010/33229

**విలేకరులు కావలెను**

18 సం॥ లుగా వెలువడుతున్న "ఫ్లాష్ ఇండియా" తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు,నియోజకవర్గాల, మరియు మండలాల వారీగా విలేకరులు కావలెను..

సెల్ నెంబర్: 9951494039

సంపుటి : 17 | సంచిక : 171 | గురువారం 13.08.2026 | ఎడిటర్ : కొమరాజు శ్రీనివాసులు | పేజీలు : 08 | వెల రూ : 2/-

## షార్ట్‌కట్‌లు వద్దు

సోషల్ మీడియా విజయాల కంటే నిజ జీవిత పాఠాలే ముఖ్యం





- షార్ట్‌కట్‌లకు యువత దూరంగా ఉండాలి: ప్రధాని మోదీ
- రీల్స్, ఇన్‌ఫ్లుయెన్సర్ల ప్రభావంపై మోదీ హెచ్చరిక
- సులభమైన మార్గాలను అనుసరించే ముందు ఆలోచించాలి

02

## వేలాది ఉద్యోగాలపై వేటు?

- ఒరాకిల్‌లో మరోసారి లేఆఫ్స్‌కు రంగం సిద్ధం
- ఈ నెలలోనే ఉద్యోగాల కోతలు చేపట్టే అవకాశం
- లేఆఫ్స్‌కు గురయ్యే ఉద్యోగులను గుర్తించాలని మేనేజర్లకు ఆదేశాలు
- కొన్ని విభాగాల్లో రెండంకెల శాతంలో ఉద్యోగాల కోత?
- ఇప్పటికే 21 వేల ఉద్యోగాలను తగ్గించిన ఒరాకిల్

02




## కేసీఆర్‌కు మళ్లీ సమన్లు..!

- మేడిగడ్డ కేటగిరీ కేసు విచారణ సెప్టెంబర్ 9కి వాయిదా
- కేసులో కీలక పరిణామం.. తదుపరి విచారణపై ఉత్కంఠ
- అసలు పిటిషనర్ మృతి.. విచారణ కొనసాగింపునకు హైకోర్టు సూచన
- కేసీఆర్‌కు సమన్లు అందక పోవడంతో మరోసారి పంపాలని ఆదేశం

03





# మిల్లర్ల బ్లాక్ మెయిల్‌ను సహించను

**నియోజకవర్గానికి 50-100 ఎకరాల భూమి కేటాయింపు**

- మిల్లర్ల బకాయిలు పూర్తిగా వసూలు చేయాల్సిందే: సీఎం రేవంత్
- ప్రతి ధాన్యం గింజకు సంబంధించిన బకాయి వసూలు చేయాలి
- ఉద్దేశపూర్వక ఎగవేతలకు పాల్పడితే కఠిన చర్యలు
- వ్యాపార దృక్పథంతో పనిచేసే మిల్లర్లకు సహకారం
- బకాయిల వసూళ్లకు ప్రత్యేక విధివిధానాలు రూపొందించాలని ఆదేశం
- మిల్లర్ల బకాయిలపై అధికారులతో సీఎం సమీక్ష
- మొండి బకాయిదారులకు ధాన్యం కేటాయింపు నిలిపివేత
- మిల్లింగ్ బాధ్యతలను మహిళా సంఘాలకు అప్పగించే యోచన
- ధాన్యం నిల్వ సమస్యకు ముందస్తు కార్యాచరణ సిద్ధం చేయాలి

02

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** మిల్లర్లు బకాయిపడిన ధాన్యం విలువకు సంబంధించిన మొత్తాన్ని వసూలు చేయాల్సిందేనని ముఖ్యమంత్రి శ్రీ ఎ.రేవంత్ రెడ్డి గారు అధికారులను ఆదేశించారు. వ్యాపార దృక్పథంతో మిల్లులు నడిపే వారితో సానుకూలంగా ఉంటామని, ఉద్దేశపూర్వకంగా ఎగవేతలకు ప్రయత్నించే వారితో కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ముఖ్యమంత్రి గారు పౌరసరఫరాల శాఖపై ఆ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి గారితో కలిసి ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో సమీక్ష నిర్వహించారు.



## ప్రభుత్వం సిద్ధంగా ఉంది

ఆర్మీ సదరన్ కమాండ్ అధికారులతో సీఎం సమావేశం

విపత్తుల వేళ ఆర్మీ సేవలను ప్రశంసించిన సీఎం

యువతకు శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని సీఎం ప్రతిపాదన

03

# నిందితులపై 20 వేల పేజీల ఛార్జ్‌షీట్


## నీట్ పేపర్ లీక్ కేసులో కీలక పరిణామం..

**నీట్-యూజీ 2026 పేపర్ లీక్‌పై సీబీఐ ఛార్జ్‌షీట్**

**లాతూర్‌లో ఆస్పత్రి గదిలో 'సీక్రెట్ క్లాస్‌రూమ్'**

- 13 మంది ప్రధాన నిందితులపై అభియోగాలు
- ఎన్‌టీఏ లోపాలు, అక్రమాలపై కీలక ఆధారాలు
- 360 మంది సాక్షుల వాంగ్మూలాలు.. 422 కీలక పత్రాలు
- 43 డిజిటల్, ఫిజికల్ ఆధారాలను కోర్టుకు సమర్పించిన సీబీఐ
- ఒక్కో పేపర్‌కు రూ.10-15 లక్షలు వసూలు చేసినట్లు ఆరోపణలు
- పేపర్ లీక్‌లో ఎన్‌టీఏ నిపుణుల హస్తం?
- ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్ నిపుణులపై సీబీఐ ఆరోపణలు
- లీకేజీ ముఠా, మధ్యవర్తులు సహా 13 మంది నిందితులు

02




## అదానీ కోసం.. లొంగిపోయారు

**దేశ ప్రయోజనాలను పణంగా పెట్టిన ప్రధాని మోదీ**



- అదానీ కేసులో అమెరికా కోర్టు నిర్ణయంపై రాహుల్ ఘాటు వ్యాఖ్యలు
- అదానీ కోసం మోదీ దేశ ప్రయోజనాలను పణంగా పెట్టారన్న రాహుల్
- దేశం భారీ మూల్యం చెల్లిస్తోందని విమర్శ
- అదానీ కోసం ప్రధాని రాజీ పడ్డారని ఆరోపణలు
- అదానీ కేసు వెనుక చాలా ఉందన్న రాహుల్ గాంధీ
- క్రిమినల్ అభియోగాల్లో మూడు ఆరోపణలు కొట్టివేత
- 'విత్ ప్రెజుడిస్' పద్ధతిలో అభియోగాల తొలగింపు
- మరోసారి అభియోగాలు దాఖలు చేయలేని విధంగా కొట్టివేత
- రెండు అభియోగాలపై తీర్పు రిజర్వ్ చేసిన న్యాయమూర్తి

03

## ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్ చెల్లదు

జీఓ 172 కింద జారీ చేసే సర్టిఫికెట్లను అంగీకరించలేం

- మీసేవ ద్వారా ఇచ్చే సర్టిఫికెట్లపై ఈసీ అభ్యంతరం
- రేషన్ కార్డు డేటాతో ఇచ్చే సర్టిఫికెట్లపై ప్రశ్నలు
- కొత్త సర్టిఫికెట్ రేషన్ కార్డుతో సమానమే: ఈసీ
- రేషన్ కార్డు పౌరసత్వానికి ఆధారం కాదని స్పష్టీకరణ
- ఓటరు జాబితా పరిశీలనలో ప్రామాణిక పత్రంగా గుర్తింపు లేదు
- తెలంగాణ సీఈవోకు ఈసీ కార్యదర్శి అధికారిక లేఖ
- జీఓ 172కు ముందు జారీ చేసిన సర్టిఫికెట్లకు మాత్రం ఓకే

03






## ఎస్టీ కార్పొరేషన్ నిధులు పక్కదారి

**గిరిజనులకు కాంగ్రెస్ ప్రభుత్వం ద్రోహం**

ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రిలో సేవలను పరిశీలించిన హరీశ్‌రావు

- రూ.2,730 కోట్లు కేటాయించి.. రూ.70 కోట్లే ఖర్చు చేశారని ఆరోపణ
- అసైన్డ్ భూముల విషయంలో ప్రభుత్వంపై హరీశ్‌రావు ఫైర్
- లక్ష ఎకరాల భూములు లాక్కున్నారని సంచలన ఆరోపణలు
- గిరిజనుల భూములను కాపాడాలని డిమాండ్
- లగచర్ల ఘటనపై ప్రభుత్వాన్ని నిలదీసిన హరీశ్‌రావు
- గిరిజన యువతకు న్యాయం చేయాలని డిమాండ్
- టిక్కీ సంస్థలు ప్రెజర్ గ్రూపులుగా పనిచేయాలి: హరీశ్‌రావు

03

## సోమాజిగూడ ప్రెస్ క్లబ్ వద్ద తీవ్ర ఉద్రిక్తత

**60 ఏళ్లకు మీరు ఎమ్మెల్సీ.. 30 ఏళ్ల మాకు ఉద్యోగం వద్దా!**



- ప్రొఫెసర్ కోదండరాంకు నిరుద్యోగుల నిరసన సెగ
- సోమాజిగూడ ప్రెస్‌క్లబ్ వద్ద తీవ్ర ఉద్రిక్తత
- కోదండరాంను చుట్టుముట్టిన నిరుద్యోగ యువత
- ఉద్యోగాల వయోపరిమితిపై నిలదీసిన నిరుద్యోగులు
- అర్హత ఉన్నా ఉద్యోగాలకు దూరమవుతున్నామని ఆవేదన
- ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను గుర్తు చేసిన యువత
- కాంగ్రెస్‌కు ఓటేశాం.. ఇప్పుడు ఎందుకు పట్టించుకోవడం లేదు?

02

# షార్ట్‌కట్‌లు వద్దు..

**ఢిల్లీ :** సోషల్ మీడియా ప్రభావం పెరిగిన ప్రస్తుత కాలంలో యువత, ముఖ్యంగా జెన్-జెడ్ తరం వారు సులభమైన మార్గాలు, షార్ట్‌కట్‌లకు ఆకర్షితులు కావద్దని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సూచించారు. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆత్మకథ 'ది ట్రయంఫ్ ఆఫ్ ది ఇండియన్ రిపబ్లిక్: మై లైఫ్, మై స్ట్రగుల్' ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న ప్రధాని.. యువతకు పలు కీలక సూచనలు చేశారు.

**కోవింద్ ప్రజాసేవకు ఆదర్శం**

రాష్ట్రపతిగా రామ్‌నాథ్ కోవింద్ ఒక ప్రత్యేక ఆదర్శాన్ని నెలకొల్పారని ప్రధాని మోడీ ప్రశంసించారు. పదవి నుంచి వైదొలిగిన తర్వాత కూడా కోవింద్ దేశం కోసం పనిచేస్తూనే ఉన్నారని తెలిపారు. 'ఒకే దేశం, ఒకే ఎన్నిక' అమలు కోసం ఏర్పాటు చేసిన జాయింట్ పార్లమెంటరీ కమిటీకి ఆయన ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్న విషయాన్ని ప్రధాని ప్రస్తావించారు. కోవింద్ ఆత్మకథను దేశంలోని కొత్త తరం తప్పకుండా చదవాలని మోదీ సూచించారు. ఈ పుస్తకం కోవింద్ వ్యక్తిగత జీవితం, ఆయన ఎదుర్కొన్న పోరాటాలను వివరిస్తుందని తెలిపారు. అయితే ఆయన విజయం కేవలం వ్యక్తిగత విజయం కాదని, భారత గణతంత్రం, ప్రజాస్వామ్యానికి కూడా లభించిన విజయమని ప్రధాని పేర్కొన్నారు.

**ప్రోటోకాల్‌ను పక్కనపెట్టి ఆత్మీయంగా..**

రాష్ట్రపతి భవన్‌లో కోవింద్‌ను కలిసిన సందర్భాలను కూడా ప్రధాని మోడీ గుర్తుచేసుకున్నారు. ప్రధానమంత్రిగా తాను రాష్ట్రపతి భవన్‌కు వెళ్లినప్పుడు కోవింద్ తరచూ ప్రోటోకాల్‌ను పక్కనపెట్టి తనతో ఆత్మీయంగా మాట్లాడేవారని చెప్పారు. అంతేకాకుండా, తాను తిరిగి వెళ్లే సమయంలో వీడ్కోలు పలికేందుకు కారు వద్దకు కూడా కోవింద్ వచ్చేవారని తెలిపారు. అలా చేయవద్దని తాను పలుమార్లు కోరినప్పటికీ కోవింద్ మాత్రం తన ఆత్మీయతను కొనసాగించేవారని మోడీ గుర్తుచేశారు. ఆయనలోని వినయం, సంస్కారం, మానవీయ విలువలను ఈ సందర్భంగా ప్రధాని కొనియాడారు.

**స్వగ్రామంలో కోవింద్ వినయం**

రామ్‌నాథ్ కోవింద్ రాష్ట్రపతిగా ఉన్న సమయంలో తన స్వగ్రామం పరుంఖ్‌ను సందర్శించిన సందర్భాన్ని కూడా మోడీ ప్రస్తావించారు. గ్రామానికి వెళ్లిన కోవింద్ తన ఉపాధ్యాయుల పాదాలకు నమస్కరించారని, గ్రామ మట్టికి నమస్కరించి అక్కడి ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారని చెప్పారు. కోవింద్ చేసిన ఈ భావోద్వేగపూరిత చర్యను దేశమంతా చూసిందని ప్రధాని అన్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, విలువలను ఆయన తన ప్రవర్తన ద్వారా ప్రపంచానికి చాటిచెప్పారని పేర్కొన్నారు. ఆయన సరళత, వినయం ప్రతి భారతీయుడూ గర్వపడేలా చేశాయని అన్నారు.

**రీల్స్, ఇన్‌ఫ్లుయెన్సర్ల ప్రభావంపై హెచ్చరిక**

ప్రస్తుత సోషల్ మీడియా యుగంలో రీల్స్, ఇన్‌ఫ్లుయెన్సర్లు యువతపై గణనీయమైన ప్రభావం చూపుతున్నారని ప్రధాని మోడీ అన్నారు. ఇన్‌ఫ్లుయెన్సర్లను అనుసరించడంలో తప్పులేదని, అయితే వారు చూపించే ప్రతి సులభమైన మార్గాన్ని అనుసరించే ముందు ఆలోచించాలని సూచించారు. జీవితంలో త్వరగా విజయం సాధించాలనే ఉద్దేశంతో షార్ట్‌కట్‌లను ఎంచుకోవడం ప్రమాదకరమని హెచ్చరించారు. దీనికి ఉదాహరణగా రైల్వే స్టేషన్లలోని పరిస్థితిని ప్రస్తావించారు. వంతెనను ఉపయోగించకుండా కొందరు రైల్వే పట్టాలను దాటి వెళ్లేందుకు ప్రయత్నిస్తారని, అలాంటి సత్వర మార్గం ప్రమాదానికి దారితీస్తుందని చెప్పారు. "సత్వరమార్గం మిమ్మల్ని దెబ్బతీస్తుంది" అనే సందేశాన్ని యువత గుర్తుంచుకోవాలని సూచించారు.

**ఆత్మకథలు చదవాలని యువతకు పిలుపు**

జీవితంలో ముందుకు సాగాలంటే ఇతరుల అనుభవాల నుంచి నేర్చుకోవడం ఎంతో ముఖ్యమని ప్రధాని మోడీ అన్నారు. తమకు నచ్చిన వ్యక్తుల ఆత్మకథలను యువత చదవాలని సూచించారు. వారి విజయాలు, వైఫల్యాలు, పోరాటాలు, అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకోవాలని చెప్పారు. రామ్‌నాథ్ కోవింద్ జీవిత ప్రయాణం కూడా యువతకు ఎన్నో విలువైన పాఠాలను అందిస్తుందని ప్రధాని పేర్కొన్నారు. సోషల్ మీడియా చూపించే తక్షణ విజయాల కంటే నిజ జీవిత అనుభవాలు, క్రమశిక్షణ, కృషి, విలువలకు ప్రాధాన్యం ఇవ్వాలని జెన్-జెడ్‌కు పరోక్షంగా సూచించారు ప్రధాని నరేంద్ర మోడీ..

## సోమాజిగూడ ప్రెస్ క్లబ్ వద్ద తీవ్ర ఉద్రిక్తత

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ఎమ్మెల్సీ, తెలంగాణ జన సమితి చీఫ్ ప్రొఫెసర్ కోదండరాం కు నిరుద్యోగుల నుంచి తీవ్ర నిరసన సెగ తగిలింది. హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్ క్లబ్ వేదికగా ప్రభుత్వ ఉద్యోగాల వయోపరిమితి పెంచే అంశంపై మాట్లాడేందుకు వచ్చిన కోదండరాంను నిరుద్యోగ యువత అడ్డుకుని, నిలదీశారు. ఒక్కసారిగా నిరుద్యోగులు పెద్ద ఎత్తున చుట్టుముట్టడంతో అక్కడ తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

**60 ఏళ్లకు మీరు ఎమ్మెల్సీ.. 30 ఏళ్ల మాకు ఉద్యోగం వద్దా!**

ఈ సందర్భంగా నిరుద్యోగులు తమ ఆవేదనను వెళ్లగక్కుతూ ఎమ్మెల్సీ కోదండరాంను ప్రశ్నలతో నిలదీశారు. 'మీరు 60 ఏళ్ల వయస్సులో కూడా సుప్రీంకోర్టు దాకా వెళ్లి ఎమ్మెల్సీ పదవి తెచ్చుకోవచ్చు.. కానీ మేము 30 ఏళ్లకు సకల అర్హతలు ఉండి ఉద్యోగం చేయడానికి పనికిరామా?' అని తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. అసెంబ్లీ ఎన్నికల్లో మీరు చెప్పారు కాబట్టే కాంగ్రెస్ పార్టీకి ఓటు వేశాం. తీరా అధికారంలోకి వచ్చాక మా వయోపరిమితి పెంపు, నోటిఫికేషన్ల సమస్యలపై మీరు ఎందుకు మాట్లాడటం లేదు?' అని నిలదీశారు. తమ సమస్యలను, ఏళ్ల తరబడి పడుతున్న మానసిక వేదనను మీడియా కూడా సరిగ్గా పట్టించుకోవడం లేదని నిరుద్యోగులు కన్నీటి పర్యంతమయ్యారు. ఇప్పటికైనా నిరుద్యోగుల వయోపరిమితి పెంపు అంశాన్ని వెంటనే ప్రభుత్వం దృష్టికి, మీడియా దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని కోదండరాంను డిమాండ్ చేశారు.

## వేలాది ఉద్యోగాలపై వేటు?

**ఢిల్లీ :** టెక్ దిగ్గజ కంపెనీలలో ఒక్కటైన ఒరాకిల్ మరోసారి ఉద్యోగాల కోతలకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మౌలిక సదుపాయాలపై భారీగా పెట్టుబడులు కొనసాగిస్తూనే.. ఉద్యోగుల వ్యయాన్ని తగ్గించేందుకు ఈ నెలలో కొత్త లేఆఫ్స్ చేపట్టాలని కంపెనీ యోచిస్తున్నట్లు ప్రముఖ నివేదిక వెల్లడించింది. బిజినెస్ ఇన్‌సైడర్ ప్రకారం.. ఒరాకిల్‌లో లేఆఫ్స్‌కు గురయ్యే ఉద్యోగులను గుర్తించాలని మేనేజర్లను కంపెనీ ఆదేశించింది. సెప్టెంబర్ 1న కంపెనీ రెండో ఆర్థిక త్రైమాసికం ప్రారంభం కానున్న నేపథ్యంలో.. అంతకంటే ముందే ఈ ఉద్యోగాల కోతలను అమలు చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కొన్ని టీమ్‌లలో ఉద్యోగుల సంఖ్య రెండంకెల శాతంలో తగ్గే అవకాశం ఉందని నివేదిక పేర్కొంది. ఈ తాజా లేఆఫ్స్‌కు ముందు కూడా ఒరాకిల్ భారీ స్థాయిలో ఉద్యోగులను తగ్గించింది. 2026 ఆర్థిక సంవత్సరంలో కంపెనీ ఉద్యోగుల సంఖ్య సుమారు 21,000 మేర తగ్గింది. ఇది కంపెనీ మొత్తం ఉద్యోగుల్లో దాదాపు 13 శాతానికి సమానం. దీంతో ఒరాకిల్‌లో ఉద్యోగుల సంఖ్య సుమారు 1,41,000కు చేరుకుంది. మరోవైపు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో తన స్థానాన్ని బలోపేతం చేసుకునేందుకు ఒరాకిల్ భారీగా ఖర్చు చేస్తోంది. 2026 ఆర్థిక సంవత్సరంలో ఏఐ సంబంధిత మౌలిక సదుపాయాల కోసం కంపెనీ సుమారు 55.7 బిలియన్ డాలర్లు ఖర్చు చేసినట్లు నివేదికలు చెబుతున్నాయి. ఈ పెట్టుబడులకు మద్దతుగా కంపెనీ సుమారు 43 బిలియన్ డాలర్లను అప్పుగా తీసుకున్నట్లు సమాచారం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మరో 40 బిలియన్ డాలర్లను డెట్, ఈక్విటీ ద్వారా సమీకరించాలని కూడా ఒరాకిల్ ప్రణాళికలు రూపొందించినట్లు తెలుస్తోంది. భారీగా పెట్టుబడులు పెడుతున్నప్పటికీ ఒరాకిల్ క్లౌడ్ వ్యాపారానికి డిమాండ్ కొనసాగుతోంది. ముఖ్యంగా ఏఐ కంప్యూటింగ్ సామర్థ్యానికి పెరుగుతున్న డిమాండ్ కారణంగా కంపెనీ క్లౌడ్ సేవల ఆదాయం గణనీయంగా పెరుగుతోంది. అయితే ఏఐ మౌలిక సదుపాయాలపై కంపెనీ భారీగా చేస్తున్న ఖర్చులు పెట్టుబడిదారుల్లో ఆందోళనలకు కారణమవుతున్నాయి. ఈ ఏడాది ఒరాకిల్ షేర్లు గణనీయంగా పడిపోయినట్లు సమాచారం. తాజా ఉద్యోగాల కోతలపై ఒరాకిల్ లేదా కంపెనీ ఉన్నతాధికారులు ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. దీంతో ఈ లేఆఫ్స్‌కు సంబంధించి పూర్తి వివరాలు ఇంకా వెల్లడికావాల్సి ఉంది.

## నిందితులపై 20 వేల పేజీల ఛార్జ్‌షీట్

**ఢిల్లీ :** దేశాన్ని కుదిపేసిన NEET-UG 2026 పేపర్ లీక్ కేసు విచారణలో అత్యంత కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ వ్యవహారంలో సీబీఐ సమర్పించిన సుమారు 20 వేల పేజీల కంప్లీట్ ఛార్జ్‌షీట్‌ను ఢిల్లీలోని రౌస్ అవెన్యూ ప్రత్యేక కోర్టు ఇవాళ పరిగణనలోకి తీసుకుంది. 13 మంది ప్రధాన నిందితులపై నమోదు చేసిన ఈ ఛార్జ్‌షీట్‌లో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ లోపాలు, అక్రమాలపై సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. అయితే, ఈ కేసును అత్యంత శాస్త్రీయంగా విచారించిన సీబీఐ, కోర్టుకు సమర్పించిన దాఖలాల్లో పక్కా ఆధారాలను పొందుపరిచింది. దాదాపు 20 వేల పేజీల ఛార్జ్‌షీట్‌తో పాటు 360 మంది సాక్షుల వాంగ్మూలాలు, 422 కీలక పత్రాలు, 43 డిజిటల్, ఫిజికల్ ఎవిడెన్స్‌లను సీబీఐ కోర్టు ముందుంచింది. అయితే, నిందితులు ఒక్కో పేపర్‌ను రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల మేర వసూలు చేసినట్లుగా అభియోగాలు ఉన్నాయి.

**పేపర్ లీక్‌లో ఎన్‌టీఏ నిపుణుల హస్తం..**

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ కి చెందిన ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్ ముగ్గురు సబ్జెక్ట్ నిపుణులే కుట్రపూరితంగా ఈ పేపర్ లీక్‌కు ఒడిగట్టినట్లుగా సీబీఐ ఆధారాలతో సహా ఛార్జ్‌షీట్‌లో పేర్కొంది. ఈ మేరకు లీకేజీ ముఠా నిర్వాహకులు, మీడియేటర్లు, ఎన్‌టీఏ నిపుణులతో కలిపి మొత్తం 13 మందిని ప్రధాన నిందితులుగా చేర్చారు. ఈ కేసులో నిందితులపై ఆరోపణల నమోదు అంశంపై రేపు రౌస్ అవెన్యూ కోర్టులో కీలక వాదనలు జరగనున్నాయి. సీబీఐ తరఫు న్యాయవాదులు నిందితుల పాత్రను వివరించనుండగా, అనంతరం విచారణ వేగవంతమయ్యే అవకాశం ఉంది. మరోవైపు లీకేజీకి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

**స్పెషల్ సీక్రెట్ క్లాస్ రూమ్..**

మహారాష్ట్రలోని లాతూర్ ప్రాంతంలో ఉన్న ఓ ప్రైవేట్ ఆసుపత్రిలోని డీలక్స్ రూమ్‌ను 'స్పెషల్ సీక్రెట్ క్లాస్ రూమ్'గా మార్చి, ఎన్‌టీఏ సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్ ద్వారా విద్యార్థులకు ప్రశ్నాపత్రంలోని సమాధానాలను డిక్టేట్ చేయించినట్లుగా సీబీఐ ఛార్జ్‌షీట్ స్పష్టం చేసింది. లాతూర్‌లోని రేణుకా ఈ-కెరీర్ కోచింగ్ ఇన్‌స్టిట్యూట్ నిర్వాహకుడు శివరాజ్ రఘునాథ్ మోతేగావ్‌కర్ కుమారుడికి ఆసుపత్రిలోని మూడో అంతస్తులోని రూమ్‌లో రహస్య క్లాసులు నిర్వహించినట్లుగా తెలింది. ఎన్‌టీఏకు చెందిన కెమిస్ట్రీ సబ్జెక్ట్ నిపుణుడు ప్రహ్లాద్ విఠల్‌రావు కులకర్ణి స్వయంగా ప్రశ్నల కాగితాల బండిల్‌తో వచ్చి, కెమిస్ట్రీకి చెందిన 132 ప్రశ్నలు, వాటి సమాధానాలను సదరు విద్యార్థి చేత నోట్‌బుక్‌లో రాయించినట్లుగా గుర్తించారు. ఏప్రిల్ 18, 19, 22 తేదీల్లో ఈ సిద్ధివినాయక ఆసుపత్రిలోనే గంటల తరబడి ఈ ప్రశ్నల సమాధానాల సాధన జరిగిందని అధికారులు వెల్లడించారు. సదరు ఆస్పత్రి ఓనర్ మనోజ్ శిరూరే అక్కడి రాగా పేపర్ లీక్‌లో ఆయన కూడా కీలక పాత్ర పోషించినట్లుగా విచారణలో వెల్లడైంది. పరీక్ష ముగిసిన అనంతరం సమాధానాలు రాసుకున్న సదరు నోట్‌బుక్‌ను పాత సామాన్లు కొనే వ్యక్తికి అమ్మేసినట్లు ప్రశ్నలు రాసిన విద్యార్థి సీబీఐ విచారణలో ఒప్పుకున్నాడు.



## బీసీ మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యం

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** బీసీ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి, వారికి స్వయం ఉపాధి అవకాశాలను కల్పించేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ, హైదరాబాద్ జిల్లా ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన మాట్లాడుతూ.. మహిళలు ఆర్థిక వృద్ధి సాధించే లక్ష్యంతో తమ ప్రభుత్వం కీలక కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. కుట్టు వృత్తిపై ఆసక్తి, నైపుణ్యం ఉన్న పేద, నిరుద్యోగ బీసీ మహిళలకు 100 శాతం ప్రభుత్వ సబ్సిడీతో ఆటోమేటిక్ కుట్టు మిషన్లను అందించే పథకాన్ని గురువారం సచివాలయంలో లాంఛనంగా ప్రారంభించనున్నట్లు చెప్పారు. రాష్ట్రంలోని 119 శాసనసభ నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గానికి 1,000 చొప్పున మొత్తం 1,19,000 ఆటోమేటిక్ కుట్టు మిషన్లను బీసీ మహిళలకు అందించనున్నట్లు చెప్పారు . లబ్ధిదారులపై ఎలాంటి ఆర్థిక భారం లేకుండా పూర్తిగా ప్రభుత్వ సబ్సిడీతో కుట్టు మిషన్లను అందజేయడం జరుగుతుందన్నారు. కుట్టు వృత్తిపై నైపుణ్యం ఉన్న మహిళలకు ఆధునిక ఆటోమేటిక్ కుట్టు మిషన్లు అందించడం ద్వారా ఇంటి వద్దనే స్వయం ఉపాధి పొందే అవకాశం కల్పించడంతో పాటు, వారి ఆదాయాన్ని పెంచి కుటుంబాల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు . పథకం విధి విధానాలు, కేటాయించిన బడ్జెట్, లబ్ధిదారుల ఎంపిక, అర్హతలు, దరఖాస్తు ప్రక్రియ తదితర పూర్తి వివరాలను గురువారం నిర్వహించే కార్యక్రమంలో వెల్లడిస్తామని, బీసీ వర్గానికి చెందిన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ ఛైర్మన్లు తదితరులు పాల్గొంటారని వెల్లడించారు.

## మిల్లర్ల బ్లాక్ మెయిల్‌ను సహించను

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** మిల్లర్లు బకాయిపడిన ధాన్యం విలువకు సంబంధించిన మొత్తాన్ని వసూలు చేయాల్సిందేనని ముఖ్యమంత్రి శ్రీ ఎ.రేవంత్ రెడ్డి గారు అధికారులను ఆదేశించారు. వ్యాపార దృక్పథంతో మిల్లులు నడిపే వారితో సానుకూలంగా ఉంటామని, ఉద్దేశపూర్వకంగా ఎగవేతలకు ప్రయత్నించే వారితో కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ముఖ్యమంత్రి గారు పౌరసరఫరాల శాఖపై ఆ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి గారితో కలిసి ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో సమీక్ష నిర్వహించారు. గత ప్రభుత్వం వేల కోట్ల రూపాయల బకాయిలకు అవకాశం ఇచ్చి, తిరిగి ఆ తప్పిదాన్ని ప్రస్తుత ప్రభుత్వానికి అంటగట్టే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. ఇప్పటికే బకాయిల వసూలులో కొంత పురోగతి ఉందని, అయితే ప్రతి ధాన్యం గింజకు సంబంధించి బకాయిని వసూలు చేయాల్సిందేనని స్పష్టం చేశారు. బకాయిల వసూలుకు సంబంధించి విధివిధానాలను రూపొందించాలని ముఖ్యమంత్రి గారు అధికారులను ఆదేశించారు. విధివిధానాల రూపకల్పన పూర్తయిన తర్వాత ఆ నివేదికను మంత్రివర్గ ఉప సంఘానికి సమర్పించాలని సూచించారు. మంత్రివర్గ ఉప సంఘం పరిశీలన అనంతరం ప్రభుత్వం తగు నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. మొండి బకాయిదారులుగా మారిన మిల్లర్లకు కేటాయించే ధాన్యాన్ని మహిళా సంఘాలకు కేటాయించి మిల్లింగ్ బాధ్యతలను మహిళా సంఘాలకు అప్పగిస్తామని చెప్పారు. ప్రతి సీజన్‌లో ధాన్యం నిల్వకు ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో ఇప్పటి నుంచే తగు కార్యాచరణ రూపొందించాలని ముఖ్యమంత్రి గారు అధికారులకు సూచించారు. ధాన్యం భారీగా వచ్చే నల్గొండ, సూర్యాపేట, నిజామాబాద్, పెద్దపల్లి, కామారెడ్డి జిల్లాల్లో సైలో బ్యాగ్‌ల ఏర్పాటుకు పైలెట్ ప్రాజెక్టు కింద చేపట్టాలని ఆదేశించారు. స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో సైలో బ్యాగ్ నిర్మాణాలకు నియోజకవర్గానికి 50 నుంచి 100 ఎకరాల భూమిని కేటాయిస్తామని ముఖ్యమంత్రి గారు తెలియజేశారు. వీటి నిర్మాణానికి సంబంధించి రెవెన్యూ, పౌరసరఫరాలు, మహిళా సంక్షేమ శాఖల మంత్రులతో సమావేశం ఏర్పాటు చేస్తామని చెప్పారు. వీబీ జీ రామ్ జీ లో ప్లాట్‌ఫాంల నిర్మాణానికి అవకాశం ఉన్నందున, విశాలమైన ప్లాట్‌ఫాంలు నిర్మించి జర్మన్ టెంట్లతో ధాన్యం నిల్వకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని సూచించారు. మండల, గ్రామ స్థాయిలో ఉన్న ప్రైవేటు గోదాములు, ధాన్యం నిల్వకు ఉపయోగపడే కల్యాణ మండపాలు, పాత థియేటర్లు, ఇతర షెడ్లను ముందుగానే గుర్తించి ధాన్యం నిల్వకు లీజుకు తీసుకోవాలని సూచించారు ఈ సమీక్షలో సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ వి.శేషాద్రి గారు, పౌరసరఫరాల సంస్థ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర గారు, సౌత్ ఇండియా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ తూడి దేవేందర్ రెడ్డి గారితో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

## అక్రమంగా నిర్వహిస్తున్న క్రషర్ నిర్మాణ పనులను వెంటనే ఆపాలి





**వలిగొండ, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** వలిగొండ మండలంలోని పహిల్వాన్‌పూర్ గ్రామంలో పంట పొలాల మధ్య క్రషర్ మిషన్ ఏర్పాటుకు గ్రామపంచాయతీ పాలకవర్గం అనుమతి ఇవ్వడంపై రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ అభ్యంతరాలను పట్టించుకోకుండా క్రషర్‌కు అనుమతి ఎలా ఇస్తారని ప్రశ్నిస్తూ గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద రైతులు ఆందోళన చేపట్టారు. గ్రామంలో ఇప్పటికే మూడుసార్లు సభలు నిర్వహించి క్రషర్ మిషన్ వద్దని గ్రామ ప్రజలు, రైతులు స్పష్టంగా అభ్యంతరం తెలిపినప్పటికీ, తమ అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా గ్రామపంచాయతీ పాలకవర్గం అనుమతి ఇవ్వడం ఏమిటని రైతులు నిలదీశారు. క్రషర్ మిషన్ కారణంగా వెలువడే దుమ్ము, ధూళితో పంటలు దెబ్బతినడంతో పాటు వ్యవసాయ భూములు నాశనమయ్యే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పశువుల ఆరోగ్యంపై కూడా ప్రభావం పడుతుందని, పంట పొలాలే తమ జీవనాధారమని తెలిపారు. మా పంట పొలాలను నాశనం చేసే క్రషర్ మిషన్ మాకు వద్దు. రైతుల అభ్యంతరాలను పట్టించుకోకుండా అనుమతి ఇవ్వడం సరికాదు అని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి క్రషర్ అనుమతులను పరిశీలించి రైతుల ప్రయోజనాలను కాపాడాలని వారు కోరారు. ఈ ఆందోళన కార్యక్రమంలో ఎలిమినేటి జంగారెడ్డి, శ్రీశైలం రెడ్డి, సత్తిరెడ్డి సునీత, మల్లారెడ్డి కలమ్మ, వెంకట్ రెడ్డి విమల, మోహన్ రెడ్డి పద్మ, శ్రీనివాస్ రెడ్డి, అంజమ్మ, బుచ్చిరెడ్డి లక్ష్మి, దుబ్బ రమేష్, బాల నర్సమ్మ, పల్లపు అంజమ్మ, శీను కనకమ్మ, సత్తిరెడ్డి వెంకట్రెడ్డి, జంగారెడ్డి, మిటకానికి కిరణ్ రెడ్డి, దుర్గమ్మ, సరిత, శారద, వట్టిపల్లి స్వామి, పైల మోహన్ రెడ్డి, పైల మల్లమ్మ, పల్లపురి రాములు, యాదయ్య, జలంధర్ రెడ్డి, వెంకట్ రెడ్డి అండమ్మ, లక్ష్మమ్మ, వనగంటి నరేష్, బండారి లక్ష్మమ్మ, ఏనుగు లింగారెడ్డి, మద్ది పుట్టారెడ్డి, భారతమ్మ, శ్యామల రమేష్, శైలజ, సుజాత, పల్లపు నరసింహ, పద్మ, మంగమ్మ తదితర రైతులు పాల్గొన్నారు.

## చెరువులో వ్యక్తి మృతదేహం లభ్యం

**శంషాబాద్,ఫ్లాష్ ఇండియా :** మండల పరిధిలోని చౌడర్‌గూడ గ్రామంలోని ఓ చెరువులో మృతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కనిమోని లక్ష్మయ్య(58) భార్య కిష్టమ్మ గతంలో మృతి చెందారు. అప్పటి నుంచి లక్ష్మయ్య తన కుమార్తె కటికెల పద్మ ఇంట్లోనే ఉంటున్నాడు. ఈ నెల 10వ తేదీ ఉదయం సుమారు 7 గంటల సమయంలో లక్ష్మయ్య కుటుంబ సభ్యులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఇంటి నుంచి బయటకు వెళ్లారు. చుట్టుపక్కల ప్రాంతాలు, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. గతంలోనూ రెండు సార్లు ఇలాగే ఇంటి నుంచి వెళ్లి తిరిగి వచ్చినందున ఈసారి కూడా తిరిగి వస్తారని కుటుంబ సభ్యులు భావించారు. 11వ తేదీ సాయంత్రం సుమారు 4:30 గంటలకు చౌడర్‌గూడ చెరువు కట్ట వద్ద వెతుకుతుండగా లక్ష్మయ్య మృతదేహం చెరువు నీటిపై తేలియాడుతూ కనిపించింది. కుటుంబ సభ్యుల సమాచారంతో పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. తన తండ్రి మృతిపై ఎవరికీ ఎలాంటి అనుమానం లేదని కుమార్తె పద్మ బుధవారం పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి మృతికి గల కారణాలపై దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

ఫ్లాష్ ఇండియా దినపత్రిక బుక్ చేసుకోవాలి అనుకుంటున్నారా లేదా మీ వ్యాపార ప్రకటనల కోసం మమ్మల్ని సంప్రదించండి 7730032999 flashindiadaily@gmail.com

# ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్ చెల్లదు

**న్యూ ఢిల్లీ :** తెలంగాణలో ప్రస్తుతం జరుగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో కొత్తగా జారీ చేస్తున్న 'ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్ల' చెల్లుబాటుపై కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టత ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం జులై 25న జారీ చేసిన జీఓ నంబర్ 172 ప్రకారం 'మీసేవ' ద్వారా ఇచ్చే ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్లను ఓటరు నమోదు, పరిశీలన ప్రక్రియలో ఆమోదించలేమని స్పష్టం చేసింది. ఈ మేరకు ఈసీ కార్యదర్శి నవీన్ కుమార్, తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి అధికారిక లేఖ రాశారు.

**రేషన్ కార్డుతో సమానమే..**

గతంలో తహశీల్దార్లు క్షేత్రస్థాయి విచారణ, పత్రాల తనిఖీ చేపట్టిన తర్వాతే ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లను జారీ చేసేవారని ఈసీ పేర్కొంది. కానీ, జీఓ 172 ప్రకారం ఎలాంటి ముందస్తు విచారణ లేకుండా, కేవలం రేషన్ కార్డు డేటా ఆధారంగా ఆన్‌లైన్‌లో రెండు రోజుల్లోనే ఈ సర్టిఫికెట్లు ఇస్తున్నారని గుర్తుచేసింది. ఫలితంగా ఈ కొత్త సర్టిఫికెట్ కేవలం 'రేషన్ కార్డు'తో సమానమని వివరించింది. రేషన్ కార్డులు పౌరసత్వానికి నిశ్చయాత్మక ఆధారం కావని, ఓటరు జాబితా తనిఖీకి వాటిని ప్రామాణిక పత్రంగా పరిగణించలేమని గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఈసీ లేఖలో ఉటంకించింది. అందువల్ల కొత్త జీఓ కింద ఇచ్చే ఫ్యామిలీ సర్టిఫికెట్లను గుర్తింపు పత్రాలుగా స్వీకరించలేమని తెలిపింది. అయితే, జీఓ 172 రాకముందు (జులై 25, 2026 కంటే ముందు) పాత విధానం ప్రకారం తహశీల్దార్ల విచారణ ద్వారా పొందిన ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లను మాత్రం SIR పరిశీలన ప్రక్రియలో ఆమోదిస్తామని లేఖలో స్పష్టం చేసింది.

# కేంద్ర మంత్రి గడ్కరీతో ఎంపీ చామల భేటీ

**న్యూ ఢిల్లీ :** భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో పెండింగ్‌లో ఉన్న కీలకమైన రోడ్డు భద్రతా పనులను, మౌలిక వసతుల కల్పనను వేగవంతం చేయాలని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం న్యూఢిల్లీలో కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని ఎంపీ నేరుగా కలిసి, నియోజకవర్గంలోని పలు రహదారుల సమస్యలపై సమగ్ర వినతిపత్రాన్ని సమర్పించి చర్చించారు.

**హైదరాబాద్ - వరంగల్ ఎన్‌హెచ్-163 ఆరు లైన్లుగా విస్తరించాలి...**

హైదరాబాద్ - వరంగల్ మధ్య ఉన్న ఎన్‌హెచ్-163 జాతీయ రహదారిపై రోజురోజుకూ పెరుగుతున్న జనాభా, పట్టణీకరణ, పారిశ్రామిక రద్దీని దృష్టిలో ఉంచుకుని దీనిని ఆరు లైన్ల రహదారిగా అప్‌గ్రేడ్ చేయాలని ఎంపీ ప్రధానంగా కోరారు. ఈ కీలక కారిడార్‌లో వాహనాల రాకపోకలు భారీగా పెరిగినందున తక్షణమే విస్తరణ పనులు ప్రారంభించాల్సిన అవసరం ఉందని మంత్రికి వివరించారు.

**ఎన్‌హెచ్-163 పై చేపట్టాల్సిన భద్రతా పనులు..**

ఎన్‌హెచ్-163 మార్గంలో రోడ్డు భద్రతను మెరుగుపరిచేందుకు పలు నిర్మాణాలు చేపట్టాలని ఎంపీ కోరారు. అనంతారం క్రాస్ రోడ్డు, సింగన్నగూడెం క్రాస్ రోడ్డు వద్ద అండర్‌పాస్‌లు, సర్వీసు రోడ్లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. భువనగిరిలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల - రామకృష్ణపురం వద్ద అండర్‌పాస్, కేంద్రీయ విద్యాలయ సమీపంలో సర్వీస్ రోడ్లు నిర్మించాలని తెలిపారు. అలాగే స్వర్ణగిరి క్షేత్రం వద్ద భక్తుల రద్దీ దృష్ట్యా వెహిక్యులర్ అండర్‌పాస్ నిర్మించాలని కోరారు. బీబీనగర్ ఎయిమ్స్ వద్ద ఇప్పటికే మంజూరైన ఆరు లైన్ల ఫ్లైఓవర్ పనులను వెంటనే ప్రారంభించాలని, 12వ వార్డు పగిడిపల్లి గ్రామంలో పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

**నకిరేకల్ ఎన్‌హెచ్-565 పరిధిలో అభివృద్ధి పనులు..**

నకిరేకల్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఎన్‌హెచ్-565 పై నకిరేకల్ - తాటికల్ రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని ఎంపీ కోరారు. చందంపల్లి వద్ద లూప్ ఫోర్, పద్మనగర్ మరియు ఇనుపముల వద్ద ఫ్లైఓవర్లు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. వీటితో పాటు కోర్లపహాడ్, కేతేపల్లి, చీకటిగూడెం, వట్టిమర్తి, పిట్టంపల్లి వద్ద అండర్‌పాస్‌లు, డ్రైనేజీ, సర్వీస్ రోడ్ల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కేంద్ర మంత్రిని కోరారు.

**లక్ష్మారెడ్డి పల్లెం వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జి...**

ఎన్‌హెచ్-365 పై లక్ష్మారెడ్డి పల్లెం - పెద్ద అంబర్‌పేట్ మధ్య గల హనుమాన్ ఆలయం సమీపంలో ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని ఎంపీ విజ్ఞప్తి చేశారు. పండుగల వేళ భక్తుల రద్దీతో అక్కడ తీవ్రంగా ట్రాఫిక్ స్తంభిస్తోందని, ప్రమాదాలు జరగకుండా రాకపోకలు సజావుగా సాగేందుకు ఇది అత్యంత అవసరమని వివరించారు. ప్రజా సౌకర్యం, రోడ్డు భద్రత, ప్రమాదాల నివారణే ధ్యేయంగా ఈ ప్రాజెక్టులకు మంత్రిత్వ శాఖ త్వరితగతిన ఆమోదం తెలిపేలా చర్యలు తీసుకోవాలని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

# కరీంనగర్‌లో పొలిటికల్ హీట్..




**కరీంనగర్,ఫ్లాష్ ఇండియా :** కరీంనగర్ నగరంలో శాంతిభద్రతల పరిరక్షణ ప్రస్తుతం పోలీసు శాఖకు తీవ్ర సవాల్‌గా మారుతోంది. గత నాలుగు నెలలుగా నగరంలో వరుసగా చోటుచేసుకుంటున్న ఉద్రిక్త సంఘటనలు, రాజకీయ పార్టీల విభేదాలు, దొంగతనాలు , వివాదాలు స్థానిక ప్రజల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. బిఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిపై జరిగిన దాడి ఘటన నుంచి మొదలుకొని, సంచలనం సృష్టించిన పీఎంజే జ్యువలరీ దోపిడీ వరకు వరుస నేరాలు పోలీసులకు నిద్రలేకుండా చేస్తున్నాయి. బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీల మధ్య నెలకొన్న తీవ్ర రాజకీయ వైషమ్యాలు తరచూ వీధి ఘర్షణలకు దారితీస్తుండటంతో పట్టణంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంటోంది.

**మాజీ మంత్రి గంగులపై వ్యాఖ్యలతో దుమారం...**

తాజాగా మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌ను ఉద్దేశించి కార్పొరేటర్ బండారి వేణు చేసిన తీవ్ర వ్యాఖ్యలు నగరంలో తీవ్ర రాజకీయ దుమారాన్ని రేపాయి. ఈ వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ బండారి వేణు ఇంటిని ముట్టడించేందుకు బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీగా యత్నించారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు రంగంలోకి దిగి ముట్టడికి యత్నించిన బిఆర్ఎస్ నేతలతో పాటు, వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన కార్పొరేటర్ బండారి వేణును కూడా అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బండారి వేణు ఇంటి పరిసర ప్రాంతాల్లో భారీగా పోలీసు బలగాలను మోహరించారు. క్షేత్రస్థాయి పరిస్థితులను ఏసీపీ వెంకటస్వామి స్వయంగా పర్యవేక్షిస్తుండగా, వరుస ఉద్రిక్తతల దృష్ట్యా నగరంలో శాంతిభద్రతలను కాపాడేందుకు పోలీసులు గట్టి నిఘా ఏర్పాటు చేశారు.

# కేసీఆర్‌కు మళ్లీ సమన్లు..!

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో సంచలనం సృష్టిస్తున్న కాళేశ్వరం ప్రాజెక్టు మేడిగడ్డ కేటగిరీ కేసు విచారణను జిల్లా కోర్టు వచ్చే నెల సెప్టెంబర్ 9వ తేదీకి వాయిదా వేసింది. ఈ కేసులో అసలు పిటిషనర్ రాయలింగమూర్తి మృతి చెందడంతో, విచారణను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రక్రియను కొనసాగించాలని హైకోర్టు సూచించింది. అంతేకాకుండా ఈ వివాదాన్ని జిల్లా కోర్టు పరిధిలోనే పరిష్కరించుకోవాలని ఉన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. అయితే ఈ కేసులో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు సమన్లు ఇంకా అందకపోవడంతో, ఆయనకు మరొకసారి సమన్లు పంపించాల్సిందిగా జిల్లా న్యాయవాదిని కోర్టు ఆదేశించింది.

**తీర్పు కోసం ఎదురుచూపులు.. లాయర్ల హాజరు**

నేడు ఈ కేసుపై తుది నిర్ణయం లేదా తీర్పు వెలువడే అవకాశం ఉండటంతో హైదరాబాద్ నుంచి ఎల్అండ్‌టీ సంస్థ ప్రతినిధులు, అలాగే మాజీ మంత్రి హరీశ్‌రావు తరపు న్యాయవాదులు ప్రత్యేకంగా జిల్లా కోర్టుకు హాజరయ్యారు. ఉదయం నుంచి తీవ్ర ఉత్కంఠ నెలకొన్నప్పటికీ, న్యాయస్థానం విచారణను సెప్టెంబర్ 9కి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించడంతో తదుపరి విచారణపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.



# "మీరు మారిపోయారు"

**న్యూ ఢిల్లీ :** ఎన్‌సిపి (ఎస్‌పి) నాయకురాలు సుప్రియా సూలే కుమార్తె వివాహ విందుకు పలువురు రాజకీయ నాయకులు హాజరయ్యారు. న్యూఢిల్లీలో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రధాని మోడీ, హోం మంత్రి అమిత్ షా, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ప్రియాంకాగాంధీ, కాంగ్రెస్ ప్రెసిడెంట్ మల్లికార్జున ఖర్గే వంటి వారు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో నేతలు తమ రాజకీయ విభేదాలను పక్కన పెట్టి సరదాగా కాసేపు మాట్లాడుకున్నారు. ఈ నేపథ్యంలోనే ప్రధాని మోడీ, ప్రియాంకాగాంధీ, ఖర్గేల మధ్య సరదా సంభాషణ జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రధాని మోడీ "ప్రియాంకా గాంధీ గారు మీరు ఎలా ఉన్నారు.?" అని ప్రశ్నించారు. దీనికి బదులుగా ప్రియాంకాగాంధీ "నేను బాగున్నాను సార్, మీరు ఎలా ఉన్నారు?" అని అడిగారు. దీనికి మోడీ స్పందిస్తూ.. "నేను అంతే" అంటూ బదులిచ్చారు. ఇదే సమయంలో ఖర్గే చర్చలోకి చేరి ప్రధాని మోడీతో "సోదరా మీరు కొంచెం మారారు" అని అన్నారు. దీనికి ప్రధాని మోడీ స్పందిస్తూ.. "అచ్చా" అని అన్నారు. దీంతో అక్కడ ఉన్న నేతల మధ్య నవ్వులు విరబూశాయి. దీని తర్వాత ప్రధాని మోడీ అందరికి చేతులు జోడించి అభివాదం చేసి అక్కడి నుంచి వెళ్లారు. ఈ సమయంలో రాహుల్ గాంధీ కూడా అక్కడే ఉన్నారు. మోదీ, ఖర్గే మధ్య జరిగిన సంభాషణను విని రాహుల్ కూడా చిరునవ్వుతో కనిపించారు. ఖర్గే చేసిన 'మీరు మారిపోయారు" అనే వ్యాఖ్యలపై నెటిజన్లు తీవ్రంగా డీకోడ్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఏ సందర్భానుసారం ఖర్గే ఈ వ్యాఖ్యలు చేశారా అని ఆలోచిస్తున్నారు. ఇటీవల ఢిల్లీలో విద్యార్థుల నిరసన నేపథ్యంలో "జెన్ జీ" యువతను ఆకట్టుకోవడానికి మోడీ సెల్ఫీ తరహా ఇన్‌స్టాగ్రామ్ వీడియోలు చేశారు. ఈ ధోరణిపై ఖర్గే అన్నారని భావిస్తున్నారు. మరోవైపు, ఈ కార్యక్రమంలో ఎన్సీపీ ఎస్పీ నేత శరద్ పవార్‌తో మోడీ మాట్లాడుతూ కనిపించారు. ఎన్సీపీ ఎస్పీకి చెందిన ఎంపీలు ఎన్డీయే కూటమిలో చేరుతారనే వార్తలు వినిపించిన నేపథ్యంలో ఈ కలయిక ఆసక్తికరంగా మారింది.

# ప్రభుత్వం సిద్ధంగా ఉంది



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** భారత ఆర్మీ చేపట్టే వివిధ నియామకాల్లో తెలంగాణ యువతను ప్రోత్సహించే విధంగా కలిసి పనిచేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు భారత ఆర్మీ సదరన్ కమాండ్ అధికారులకు తెలిపారు. ఆర్మీ సదరన్ కమాండ్ జనరల్ ఆఫీసర్ కమాండింగ్-ఇన్-చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ రాజేష్ పుష్కర్ గారు పలువురు ఆర్మీ ప్రతినిధులతో ఎంసీఆర్ హెచ్ఆర్డీలోని బోధి పెవిలియన్‌లో ముఖ్యమంత్రి గారిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి గారు కూడా ఉన్నారు. ఆర్మీ నియామకాల్లో స్థానిక యువతకు భారీ అవకాశాలు కల్పించే లక్ష్యంతో ఆసక్తి ఉన్న అనువైన జిల్లా కేంద్రాల్లో శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గారు కోరగా లెఫ్టినెంట్ జనరల్ సుముఖత వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా నిర్వహించే వివిధ ఆర్మీ రిక్రూట్మెంట్లకు ముందస్తుగా తెలంగాణలోని ఆయా జిల్లా కేంద్రాల్లో యువతకు శిక్షణ కేంద్రాల ఏర్పాటు చేస్తామని తెలిపారు. దేశంలో విపత్తుల సమయంలో ఆర్మీ పోషిస్తున్న పాత్రను ముఖ్యమంత్రి గారు అభినందించారు. రాష్ట్రంలో వరద ప్రభావిత ప్రాంతాల్లో రెస్క్యూ ఆపరేషన్లు, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, పునరావాస చర్యల్లో ఆర్మీ యంత్రాంగం మరింత క్రియాశీలకంగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి కోరారు. తెలంగాణలో విపత్తు పరిస్థితుల్లో ప్రత్యేకంగా చొరవ తీసుకునేలా స్థానిక ఆర్మీ అధికారులను ఆదేశిస్తాన రాజేష్ పుష్కర్ గారు చెప్పారు. కాలుష్యాన్ని తగ్గించడమే కాకుండా చారిత్రక హైదరాబాద్ నగరానికి పూర్వవైభవాన్ని తేవాలన్న పట్టుదలతో మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు చేపట్టడంపై లెఫ్టినెంట్ జనరల్ గారు రాష్ట్ర ప్రభుత్వాన్ని అభినందించారు. హైదరాబాద్ నగరాన్ని రక్షించడానికి మూసీ నది ప్రక్షాళన అవసరమని అన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ జనరల్ ఆఫీసర్ కమాండింగ్ మేజర్ జనరల్ ఎన్. శ్రీనివాస్ రావు గారు, ఇతర ఆర్మీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# అదానీ కోసం.. లొంగిపోయారు

**న్యూఢిల్లీ :** అవానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీపై ఉన్న క్రిమినల్ అభియోగాలను అమెరికా కోర్టు కొట్టి వేయడంపై లోక్సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ ఘాటుగా స్పందించారు. అదానీ కోసం ప్రధాని మోదీ రాజీ పడ్డారని దుయ్యబట్టారు. అదానీ కోసం దేశ ప్రయోజ నాలను ప్రధాని పణంగా పెట్టారని ఆరోపణలు గుప్పిం చారు. రాజీ పడిన ప్రధాని మోదీ దేశ ప్రయోజనాలన అమ్ముకోవాల్సి వచ్చిందని ఆరోపించారు. దీని వెనుక కంటికి కనిపించే దానికంటే చాలా ఎక్కువ ఉందని విమర్శించారు. అదానీ కోసం దేశం భారీ మూల్యం చెల్లిస్తోందని మండిపడ్డారు. గౌతమ్ అదానీ, ఆయన సోదరుడి కుమారుడు సాగర్ అదానీపై ఉన్న క్రిమినల్ అభియోగాలను అమెరికా కోర్టు కొట్టివేయడంపై వచ్చిన ఒక మీడియా నివేదిక స్క్రీన్షాట్ను రాహు ల్ ఎక్స్లో పోస్ట్ చేశారు. ఈ క్రమంలో మోదీ సర్కార్ తీవ్రంగా విరుచుకుపడ్డారు.

**విత్ ప్రెజుడిస్ పద్ధతి కింద కొట్టివేత**

గౌతమ్ అదానీ, సాగర్ అదానీ, అదానీ గ్రీన్ ఎనర్జీ మాజీ సీఈఓ వినీత్ జైన్ పై నమోదైన అభియోగ పత్రంలోని 2, 3, 4 అభియో గాలను కొట్టివేయాలని కోరుతూ న్యాయ శాఖ దాఖలు చేసిన రూల్స్ 48 (ఎ) అభ్యర్థనను ఆగస్టు 10న జారీ చేసిన 47 పేజీల ఉత్తర్వుల్లో న్యాయమూర్తి గరౌఫిస్ ఆమోదం చెప్పారు. ఈ అభియోగాల్లో సెక్యూరిటీల మోసం కుట్ర, వైర్ఫ్రాడ్ కుట్ర, సెక్యూరిటీల మోసం వంటివి ఉన్నాయి. ఈ అభియోగాలను 'విత్ ప్రెజుడిస్' పద్ధతి కింద న్యాయమూర్తి కొట్టివేశారు. అంటే ఈ అభియోగాలను మళ్లీ దాఖలు చేయడానికి వేల్లేదన్నమాట.

**ఆ తీర్పు మాత్రం రిజర్వ్**

అయితే విదేశీ అవినీతి నిరోధక చట్టం ఉల్లంఘన లకు పాల్పడ్డారని ఉన్న మొదటి అభియోగంపైనా, న్యాయానికి ఆటంకం కలిగించడానికి కుట్ర పన్నారని ఆరోపిస్తున్న అయిదో అభియోగంపై న్యాయమూర్తి గరౌఫిస్ తీర్పును రిజర్వ్ ఉంచారు. ఈ రెండు అభియోగాల్లోనూ కోర్టుకు హాజరు కాని భారత్కు చెందిన అయిదుగురు సహ నిందితులు రంజిత్ గుప్తా, సిరిల్ కాబానెస్, సౌరభ్ అగర్వాల్, దీపక్ మల్హోత్రా, రూపేశ్ అగర్వాల్ ఉన్నారు. ఈ అభియోగాల కొట్టివేత ప్రాసిక్యూటర్ విచక్షణ మేరకు తీసుకు న్నదే మినహా, ఆరోపణలపై ఇచ్చిన తీర్పు కాదని న్యాయమూర్తి గరౌఫిస్ స్పష్టం చేశారు. ఈ తీర్పును ప్రభుత్వ నిర్ణయంతో కోర్టు ఏకీభవిస్తున్నట్లుగా గానీ, కేసు యోగ్యతపై అభిప్రాయంగా గానీ ఎవరూ పొరపాటు పడకూడదని వ్యాఖ్యానించారు.

**అదానీపై లంచం ఆరోపణలు**

2024 నవంబర్ లో అదానీ, సాగర్ అదానీ, వినీత్ జైన్ తదితరులపై అమెరికాలో క్రిమినల్ అభియోగాలు నమోద య్యాయి. భారత్లో సౌర విద్యుత్ ప్రాజెక్టులకు సంబంధించిన ఒప్పందాలను దక్కించుకునేందుకు భారత ప్రభుత్వ అధికారు లకు సుమారు 250 మిలియన్ డాలర్ల లంచాన్ని వీరు చెల్లించారనేది ప్రధాన ఆరోపణ. ఈ ఒప్పందాల ద్వారా రెండు దశాబ్దాల్లో పన్నుల అనంతరం 200 కోట్ల డాలర్లకు పైగా లాభాలు పొందే అవకాశం ఉందని అమెరికా ప్రాసిక్యూటర్లు పేర్కొన్నారు. అమెరికా మార్కెట్లలో రుణాలు, బాండ్ల ద్వారా 300 కోట్ల డాలర్లకు పైగా సమీకరించే సమయంలో పెట్టుబడిదారులను తప్పుదోవ పట్టించారనే ఆరోపణలు ఉన్నాయి. అయితే అదానీ గ్రూప్ మొదటి నుంచీ ఈ ఆరోపణలను ఖండిస్తోంది. తాము చట్టాలు, నియంత్రణ నిబంధనలకు అనుగుణంగానే వ్యవహరించామని చెప్పింది. తాజాగా గౌతమ్ అదానీ సహా ఇతరులపై దాఖలైన క్రిమినల్ అభియోగాలను అమెరికా కోర్టు కొట్టివేసింది.

**అసలేంటీ కేసు?**

అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ, ఆయన సోదరుడి కుమారుడు సాగర్ అదానీపై ఉన్న క్రిమినల్ అభియోగాలపై అమెరికా న్యాయస్థానం కీలక నిర్ణయం తీసుకుంది. ఇరువురిపై ఉన్న క్రిమినల్ అభియోగాలను శాశ్వతంగా కొట్టివేస్తూ అమెరికా ఫెడరల్ న్యాయమూర్తి నిర్ణయం తీసుకున్నారు. అదానీ, సాగర్ పై అభియోగాలు కొట్టివేయా లన్న న్యాయశాఖ అభ్యర్థనను న్యూయార్క్ ఈస్టర్న్ డిస్ట్రిక్ట్కు చెందిన అమెరికా జిల్లా న్యాయమూర్తి నికోలస్ గరౌఫిస్ ఆమోదం తెలిపారు.

# ఎస్టీ కార్పొరేషన్ నిధులు పక్కదారి

**సిద్దిపేట,ఫ్లాష్ ఇండియా :** ఎస్టీ కార్పొరేషన్ నిధులను రాష్ట్ర ప్రభుత్వం పక్కదారి పట్టిస్తుందని మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు అన్నారు. సిద్దిపేటలో ట్రైబల్ ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (టీఐసీసీఐ) ఆధ్వర్యంలో జరిగిన గిరిజన పారిశ్రామికవేత్తల అవగాహన సదస్సు కు హరీశ్ రావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజనులకు తీవ్ర ద్రోహం చేస్తుందన్నారు. ఎస్టీ కార్పొరేషన్ రూ. 2,730 కోట్లు కేటాయించినట్లు రాష్ట్ర ప్రభుత్వం గొప్పలు చెప్పి ఖర్చు పెట్టింది మాత్రం రూ. 70 కోట్లు మాత్రమే అన్నారు. ఎస్సీ, ఎస్టీ భూములకు పట్టాలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి ఇవాళ లక్ష ఎకరాల అసైన్డ్ భూములను గుంజుకుని పేదలను రోడ్డున పడేశారని మండిపడ్డారు. లగచర్లలో భూములు ఇవ్వబోమని అడిగిన పాపానికి లంబాడీ బిడ్డలను జైల్లో పెట్టి థర్డ్ డిగ్రీ ప్రయోగించారన్నారు. గిరిజనుల భూములను లాక్కుని ముఖ్యమంత్రి సోదరుడు కొండల్ రెడ్డికి, అల్లుడు సత్యకు కట్టబెట్టారన్నారు. గత ప్రభుత్వం తండాలను జీపీలు చేస్తే.. ఈ ప్రభుత్వం భూములు గుంజుకుంటోందన్నారు. యువతకు అన్యాయం జరుగుతున్న ఈ పరిస్థితుల్లో టిక్కీ లాంటి సంస్థలు కేవలం సహకారం అందించడమే కాకుండా, ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే ఒక ప్రెజర్ గ్రూప్‌గా కూడా పనిచేయాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న సబ్సిడీలను రాబట్టడానికి అసెంబ్లీలో ప్రధాన ప్రతిపక్షంగా గిరిజనుల పక్షాన బీఆర్ఎస్ పోరాటం చేస్తుందన్నారు. సిద్దిపేట జిల్లాలోని ఎస్టీ యువతీ యువకులు టిక్కీ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇందులో సభ్యులుగా చేరి, నైపుణ్యాలు పెంచుకుని గొప్ప పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రిని ఎమ్మెల్యే హరీశ్ రావు సందర్శించి ఆసుపత్రిలో ప్రజలకు అందుతున్న కంటి వైద్య సేవల తీరును పరిశీలించారు. అదే విధంగా బ్రిటన్ పార్లమెంట్ హౌస్ ఆఫ్ లార్డ్స్ కు ఎన్నికైన సిద్దిపేట ముద్దుబిడ్డ ఉదయ్ నాగరాజు పౌర సన్మాన కార్యక్రమానికి బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ముఖ్య అతిథిగా హాజరై ఉదయ్ నాగరాజును శాలువా కప్పి ఘనంగా సత్కరించారు.

# కల్వకుర్తి అభివృద్ధికి రూ.130 కోట్లు..



**ఆమనగల్లు,ఫ్లాష్ ఇండియా :** కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి మరిన్ని నిధులు మంజూరు చేయాలని కోరుతూ ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి బుధవారం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలోని ఆమనగల్లు, కల్వకుర్తి మున్సిపాలిటీల్లో సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనుల కోసం రూ. 80 కోట్లు మంజూరు చేయాలని ఎమ్మెల్యే ప్రతిపాదించారు. ఇందులో ఆమనగల్లుకు రూ. 30 కోట్లు, కల్వకుర్తికి రూ. 50 కోట్లు కేటాయించాలని కోరారు. అలాగే పేదలు, లంబాడీలు అధికంగా ఉన్న నియోజకవర్గంలో అర్హులైన నిరుపేద కుటుంబాలకు ప్రయోజనం చేకూరేలా అదనంగా 2,000 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అన్ని గ్రామాలు, గ్రామపంచాయతీల్లో యూజీడీ నిధుల ద్వారా అభివృద్ధి పనులకు రూ. 50 కోట్లు కేటాయించాలని కోరారు. ఎమ్మెల్యే చేసిన ప్రతిపాదనలపై సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించి, అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

## సంపాదకీయం

# కాళేశ్వరం రాజకీయ అస్త్రమా?

తెలంగాణ రాజకీయాల్లో కాళేశ్వరం ప్రాజెక్టు మరోసారి కేంద్ర బిందువుగా మారింది. ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీకి సంబంధించిన సమస్యలు, నిర్మాణ లోపాలపై వచ్చిన విమర్శలు ఒకవైపు ఉంటే.. కాళేశ్వరం కింద నిర్మించిన మౌలిక వసతులను ప్రస్తుత ప్రభుత్వం వినియోగిస్తున్న తీరు మరోవైపు రాజకీయ చర్చకు దారితీస్తోంది. ఈ రెండు అంశాలను కలిపి చూస్తే అసలు ప్రశ్న ఒక్కటే కాళేశ్వరాన్ని మొత్తం తిరస్కరించడం సాధ్యమా? లేక లోపాలను సరిదిద్దుకుంటూ అందులోని ఉపయోగకరమైన వ్యవస్థను కొనసాగించాలా?వర్షాలు ప్రారంభం కాగానే ఎల్లంపల్లి, నందిమేడారం, గాయత్రి పంప్‌హౌస్‌ల వద్ద పంపులను నడిపిస్తూ గోదావరి నీటిని మిడ్‌మానేరుకు తరలించే ప్రయత్నాలు జరిగాయి. రివర్స్ పంపింగ్ ద్వారా ఎస్సారెస్పీని నింపే ఆలోచన కూడా ప్రభుత్వం నుంచి వినిపిస్తోంది. ఇక్కడే రాజకీయ విమర్శకులు ఒక కీలక ప్రశ్నను లేవనెత్తుతున్నారు. ఈ పంప్‌హౌస్‌లు, వరద కాలువలు, రిజర్వాయర్లు, పంపింగ్ వ్యవస్థలు కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగం కాదా?మిడ్‌మానేరు నుంచి అన్నపూర్ణ, రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్, బస్వాపూర్ వంటి రిజర్వాయర్లకు నీటిని తరలించే వ్యవస్థ కూడా ఇదే ప్రాజెక్టు నిర్మాణంలో ఏర్పడింది. మల్లన్నసాగర్ నుంచి మూసీకి నీటిని తరలించే ప్రణాళికను కూడా ప్రభుత్వం ముందుకు తెస్తోంది. అంటే ఒకవైపు కాళేశ్వరాన్ని తీవ్రంగా విమర్శిస్తూనే, మరోవైపు దాని ద్వారా ఏర్పడిన మౌలిక వసతులను ఉపయోగించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్న వాదనకు ఇది బలం ఇస్తోంది.అయితే ఇక్కడ ఒక ముఖ్యమైన రాజకీయ తేడాను గుర్తించాలి. కాళేశ్వరంలోని మౌలిక వసతులను ఉపయోగించడం అంటే ప్రాజెక్టులో జరిగిన ప్రతి తప్పును సమర్థించడం కాదు. అదే సమయంలో మేడిగడ్డలో జరిగిన సమస్యను చూపించి మొత్తం కాళేశ్వరం వ్యవస్థను విఫల ప్రాజెక్టుగా చిత్రీకరించడం కూడా సమగ్ర విశ్లేషణ కాదు.మేడిగడ్డ బ్యారేజీలో ఒక బ్లాక్‌లో పిల్లర్లు కుంగిన విషయం తీవ్రమైనదే. దానిపై నాణ్యత, డిజైన్, నిర్మాణం, నిర్వహణ వంటి అంశాలపై పూర్తి స్థాయి సాంకేతిక విచారణ అవసరం. ప్రజాధనం ఖర్చయిన ప్రాజెక్టులో లోపం బయటపడితే బాధ్యతను నిర్ణయించాల్సిందే. కానీ దానికి పరిష్కారం మొత్తం వ్యవస్థను పక్కన పెట్టడం కాకుండా, దెబ్బతిన్న భాగాన్ని శాస్త్రీయంగా పునరుద్ధరించి మిగిలిన వ్యవస్థను ఎలా సమర్థంగా వినియోగించాలనే దానిపై ఉండాలి.ఇదే సమయంలో మరో ప్రశ్న కూడా సహజంగానే వస్తుంది. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇంతకాలం గడిచినా మేడిగడ్డలో దెబ్బతిన్న భాగాన్ని మరమ్మతు చేసి పునర్వినియోగంలోకి తీసుకురావడంపై స్పష్టమైన కార్యాచరణ ఎందుకు కనిపించడం లేదు? ఒక ప్రాజెక్టును విమర్శించడం రాజకీయంగా సులభం. కానీ దాన్ని సరిచేసి ప్రజలకు ఉపయోగపడేలా చేయడం పరిపాలనా బాధ్యత.కాళేశ్వరంపై రాజకీయ వాదనల్లో మరో ముఖ్యమైన అంశం ప్రాజెక్టు వ్యయం. “లక్ష కోట్లు గోదావరిలో కలిసిపోయాయి” అనే రాజకీయ నినాదం ప్రజల్లో బలంగా వినిపిస్తోంది. కానీ ప్రాజెక్టు వ్యయం ఎందుకు పెరిగిందనే ప్రశ్నకు మాత్రం కేవలం ఒక లెక్కతో సమాధానం చెప్పడం సాధ్యం కాదు.ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును రీ-డిజైన్ చేసి కాళేశ్వరం రూపంలో ముందుకు తీసుకెళ్లినప్పుడు ప్రాజెక్టు పరిధి గణనీయంగా మారింది. బ్యారేజీల సంఖ్య, పంపింగ్ సామర్థ్యం, రిజర్వాయర్ల సామర్థ్యం, సొరంగాలు, పైప్‌లైన్లు, విద్యుత్ వ్యవస్థలు, భూసేకరణ, పునరావాసం---ఇవన్నీ ప్రాజెక్టు వ్యయంపై ప్రభావం చూపాయి.ముఖ్యంగా నీటిని ఎత్తిపోసే సామర్థ్యాన్ని పెంచడం ఒక పెద్ద నిర్ణయం. రోజుకు 2 టీఎంసీల నుంచి 3 టీఎంసీలకు పంపింగ్ సామర్థ్యాన్ని పెంచినప్పుడు భారీ మోటార్లు, పంపులు, పైప్‌లైన్లు, విద్యుత్ సబ్‌స్టేషన్లు వంటి అదనపు మౌలిక వసతులు అవసరమయ్యాయి. సహజంగానే దాని ప్రభావం వ్యయంపై పడుతుంది.అదే విధంగా రిజర్వాయర్ల సామర్థ్యాన్ని పెంచడం కూడా ప్రాజెక్టు పరిమాణాన్ని పూర్తిగా మార్చేసింది. పాత ప్రణాళికలో చిన్న స్థాయిలో ఉన్న కొన్ని రిజర్వాయర్లు కాళేశ్వరం రూపకల్పనలో భారీ నిల్వ సామర్థ్యంతో అభివృద్ధి చేయబడ్డాయి. మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్, బస్వాపూర్, గంధమల్ల వంటి రిజర్వాయర్ల విషయంలో జరిగిన మార్పులు కేవలం ఇంజినీరింగ్ మార్పులు కాదు వాటి వెనుక భూసేకరణ, పునరావాసం, పరిహారం, కాలువలు, పంపింగ్ వ్యవస్థలు వంటి అనేక అదనపు ఖర్చులు ఉన్నాయి.అందువల్ల “ఖర్చు పెరిగింది కాబట్టి అవినీతి” అనడం ఎంత సరళీకరణో, “ఖర్చు పెరిగింది కాబట్టి అంతా సమర్థనీయమే” అనడం కూడా అంతే తప్పు. అసలు అవసరమయ్యేది ప్రతి దశలో ఖర్చు ఎలా పెరిగింది, ఏ నిర్ణయం వల్ల ఎంత అదనపు వ్యయం వచ్చింది, దాని ద్వారా ఎంత అదనపు ప్రయోజనం కలిగింది అనే విషయాలపై ప్రజలకు స్పష్టమైన లెక్కలు ఇవ్వడం.ఇక కాళేశ్వరం రూపకల్పనలోని మరో ముఖ్యమైన అంశం దాని బహుళ-స్థాయి నీటి నిర్వహణ వ్యూహం. గోదావరిలో భారీ వరదలు వచ్చినప్పుడు దిగువన నీటిని అందుబాటులోకి తీసుకుని ఎత్తిపోసుకోవడం ఒక విధానం. సాధారణ వర్షపాతం ఉన్నప్పుడు ఎల్లంపల్లి ప్రాంతం నుంచి నీటిని ఎత్తి మిడ్‌మానేరు మీదుగా పై రిజర్వాయర్లకు తరలించడం మరో విధానం. నీటి లభ్యత తక్కువగా ఉన్న పరిస్థితుల్లో అందుబాటులోకి వచ్చే వరద నీటిని కూడా ఉపయోగించుకునే విధంగా వ్యవస్థను రూపొందించారన్నది దాని అనుకూల వాదన.అంటే కాళేశ్వరం కేవలం మూడు బ్యారేజీల పేరుతో ముగిసిపోయే ప్రాజెక్టు కాదు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల సమస్యలను కాళేశ్వరం మొత్తం వ్యవస్థకు సమానంగా చూడటం సాంకేతికంగా సరైన విశ్లేషణ కాదు. అదే సమయంలో ఆ మూడు బ్యారేజీల సమస్యలను చిన్నచూపు చూడటం కూడా ప్రమాదకరం.ఇక్కడే రాజకీయానికి, పరిపాలనకు మధ్య తేడా కనిపిస్తుంది.రాజకీయ నాయకుడికి కాళేశ్వరం ఒక నినాదం కావచ్చు. కానీ రైతుకు అది నీరు. ఇంజినీర్‌కు అది ఒక భారీ లిఫ్ట్ ఇరిగేషన్ వ్యవస్థ. పన్ను చెల్లించే ప్రజలకు అది వేల కోట్ల ప్రజాధనం. అందువల్ల ఈ మూడు కోణాలను కలిపి చూడాల్సిందే.పోలవరం వంటి ఇతర భారీ ప్రాజెక్టుల్లో కూడా నిర్మాణ సమస్యలు, పునరుద్ధరణ అవసరాలు, అదనపు వ్యయాలు ఎదురయ్యాయి. వాటి నుంచి నేర్చుకోవాల్సిన పాఠం ఒకటే భారీ నీటిపారుదల ప్రాజెక్టులు ఒకసారి నిర్మించగానే శాశ్వతంగా పూర్తయిన వ్యవస్థలు కావు. నిర్వహణ, మరమ్మతులు, పునరుద్ధరణ, సాంకేతిక పర్యవేక్షణ నిరంతర ప్రక్రియ.కాళేశ్వరంపై కూడా ఇదే దృక్పథం అవసరం.రేవంత్ ప్రభుత్వం కాళేశ్వరాన్ని విమర్శించడం రాజకీయంగా తప్పనిసరిగా తప్పు కాదు. గత ప్రభుత్వ నిర్ణయాలను ప్రశ్నించే హక్కు కొత్త ప్రభుత్వానికి ఉంది. కానీ ఆ విమర్శ సాంకేతిక ఆధారాలతో, ఆర్థిక లెక్కలతో, బాధ్యత నిర్ధారణతో ఉండాలి. “కూలేశ్వరం” వంటి రాజకీయ పదజాలం ప్రజలకు తక్షణ రాజకీయ సందేశాన్ని ఇవ్వవచ్చు. కానీ తెలంగాణ నీటి భవిష్యత్తుకు అది పరిష్కారం కాదు.అదే విధంగా గత ప్రభుత్వం కూడా “కాళేశ్వరం గొప్ప ప్రాజెక్టు” అనే ఒక్క వాదనతో దాని లోపాలను కప్పిపుచ్చే ప్రయత్నం చేయకూడదు. మేడిగడ్డలో జరిగిన నష్టం నిజమే అయితే దానికి బాధ్యత ఎవరిది? డిజైన్‌లో లోపమా? నిర్మాణ నాణ్యతలో సమస్యా? నిర్వహణలో వైఫల్యమా? వరదల ప్రభావమా?ఇవన్నీ నిపుణుల నివేదికల ఆధారంగా తేలాలి.కాళేశ్వరాన్ని కాపాడటం అంటే గత ప్రభుత్వాన్ని కాపాడటం కాదు. కాళేశ్వరాన్ని విమర్శించడం అంటే తెలంగాణ నీటి అవసరాలను తిరస్కరించడం కూడా కాదు.తెలంగాణకు అవసరమైనది రాజకీయ ప్రతీకారం కాదు నీటి భద్రత. వేల కోట్ల ప్రజాధనంతో నిర్మించిన మౌలిక వసతులను పూర్తిగా వదిలేయడం కూడా ప్రజలకు నష్టమే. లోపాలను పట్టించుకోకుండా యథాతథంగా కొనసాగించడం కూడా అంతే ప్రమాదకరం.అందుకే ఇప్పుడు అవసరమైనది “కాళేశ్వరం ఎవరిది?” అనే రాజకీయ ప్రశ్న కాదు; “కాళేశ్వరాన్ని ఎలా సరిచేసి తెలంగాణకు గరిష్ఠ ప్రయోజనం అందించాలి?” అనే పరిపాలనా ప్రశ్న.రాజకీయ పార్టీలు తమ ఆరోపణలు చేసుకోవచ్చు. కానీ చివరికి గోదావరి నీరు ఎక్కడికి చేరింది, ఎన్ని ఎకరాలకు సాగునీరు అందింది, ఎంత విద్యుత్ ఖర్చయింది, ఎంత ప్రజాధనం ఖర్చయింది, ఏ నిర్మాణం పనిచేస్తోంది, ఏది మరమ్మతు చేయాలి ఈ ప్రశ్నలకు మాత్రమే చరిత్ర సమాధానం చెబుతుంది.కాళేశ్వరం రాజకీయ యుద్ధభూమిగా మిగిలిపోతుందా? లేక తెలంగాణ భవిష్యత్తు నీటి మౌలిక వసతిగా పునరుద్ధరించబడుతుందా? నిర్ణయం ఇప్పుడు ప్రభుత్వాల చేతుల్లోనే ఉంది.

# గందరగోళం మధ్యే డిజిటలైజేషన్

తెలుగు రాష్ట్రాల్లో సర్ ప్రక్రియ ఎట్టకేలకు ముగిసింది. సర్ మొదలైన దగ్గర్నుంచీ తీవ్ర గందరగోళం, సమస్యలు తప్పలేదు. పలుచోట్ల ఓటర్లు అయోమయానికి గురయ్యారు. ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ కూడా అస్తవ్యస్తంగా జరిగింది. అయితే సర్‌పై ఏపీలో పెద్దగా అభ్యంతరాలు రాకపోయినా.. తెలంగాణలో మరీ ముఖ్యంగా హైదరాబాద్‌లో పెద్ద సంఖ్యలో ఓట్లు గల్లంతు కావడంపై చర్చ జరుగుతోంది. అన్నింటికీ మించి ఈ సర్ ప్రభావం.. నియోజకవర్గాల పునర్విభజనపై ఏ స్థాయిలో పడుతుందోననే ఆసక్తి వ్యక్తమవుతోంది. కేంద్ర ఎన్నికల సంఘం ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ.. సర్‌ను ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. బోగస్, డబుల్ ఎంట్రీ ఓటర్లను తొలగించడం కోసం చేపట్టిన స్పెషల్ ఇంటెన్స్ రివిజన్ ప్రక్రియ పట్టణాలు, పల్లెలు అనే తేడా లేకుండా అలజడి, సందేహాలను ఓటర్ల ముంగిటకు తీసుకువచ్చింది. అసలు ఎస్ఐఆర్ ఫారం నింపడమే సమస్యగా మారింది. ఎన్యూమరేషన్ ఫారాలను ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం భర్తీ చేసి బీఎల్వోలకు ఇస్తే ఫారాలను డిజిటలైజేషన్ చేస్తారు. కానీ ఓటర్లు ఈ ఫారాలను నింపేందుకు సరైన అవగాహన లేక ఇబ్బందులు పడ్డారు. పోనీ బీఎల్వోల సాయం తీసుకుందామంటే.. వారు ముందే చేతలెత్తేశారు.భారత ప్రజాస్వామ్యానికి పునాది ఎన్నికల ప్రక్రియ. దీన్ని ప్రాధాన్యతను గుర్తించిన భారత రాజ్యాంగ రూపకర్తలు ఎన్నికల సంఘానికి స్వయం ప్రతిపత్తి కల్పించారు. ఆ ప్రక్రియలో భాగంగానే ఓటర్లలో అర్హులెవరో.. అనర్హులెవరో తేల్చే కీలక బాధ్యతను అప్పగించారు. ఇప్పటిదాకా ఈసీ విశ్వసనీయతపై ఎప్పుడూ సందేహాలు వ్యక్తం కాలేదు. కానీ ఇప్పుడు మాత్రం ఈసీ అధికార పార్టీ ఒత్తిడి మేరకు పనిచేస్తోందనే నిందను మోయాల్సిన దుస్థితి వచ్చింది. దీంతో కీలకమైన సర్ ప్రక్రియలో ముందే మొదలైన అనుమానాలకు.. అది జరుగుతున్న ప్రక్రియలో లోపాలు మరింత ఆజ్యం పోశాయి. సర్ ప్రక్రియకు పునాది అయిన మ్యాపింగ్ ప్రక్రియలోనే తీవ్ర లోపాలు జరిగాయనే వాదన అసలు మొత్తం ప్రక్రియనే ప్రశ్నార్థకం చేసింది. ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో సర్ ముగియడంతో.. ఇంత గందరగోళం గతంలో ఎప్పుడూ లేదనేది సర్వత్రా వినిపిస్తున్న మాట.ఆంధ్రప్రదేశ్‌లో సర్ ప్రక్రియ ఈ నెల 24తో ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా 44,71,523 ఓట్లు తొలగింపు జాబితాలో చేరాయి. ఇవి మొత్తం ఓట్లలో 10.75 శాతంగా ఉన్నాయి. దీనికి భిన్నంగా తెలంగాణలో దాదాపు 22 శాతం ఓటర్ల వివరాలు డిజిటైజేషన్ కాలేదు. అంటే 73.95 లక్షల ఓటర్లు వారి ఎన్యుమరేషన్ ఫారాలు వెనక్కి ఇవ్వలేదు.దేశంలో ఇంతకుముందు 1951-52, 1960, 1980, 1993, 1995, 2002 సంవత్సరాల్లో సర్ ప్రక్రియ నిర్వహించారు. 1993-95లో ఎన్నికల గుర్తింపు కార్డు జారీచేసే సమయంలోనూ దేశ వ్యాప్తంగా ఓటర్ల జాబితాను సవరించారు. ఈ అన్ని సందర్భాల్లోనూ పారదర్శకంగా సర్ ప్రక్రియ చేపట్టిన చరిత్ర ఎన్నికల సంఘానికి ఉంది. ప్యూరిఫికేషన్ కోసం ఓటర్ల జాబితా సవరణ చేపడుతున్నట్టు చెబుతున్న ఎన్నికల సంఘం ప్రజలకు సందేహాలు లేకుండా క్లారిఫికేషన్ ఇవ్వాలి. అందరికీ టెక్నాలజీలో అనుభవం ఉండదు కాబట్టి సర్ పై ఓటర్లలో పూర్తి అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉంది. కానీ ఈసారి సర్‌లో ఈసీ ఇచ్చిన వివరణ సరిపోలేదని, మరీ ముఖ్యంగా ఓటర్లకు చాలా అనుమానాలు అలాగే ఉన్నాయని తేలింది.ప్రస్తుతానికి సర్ తంతు ముగిసిందనిపించింది ఈసీ. ప్రస్తుత సర్ నుంచి కచ్చితంగా గుణపాఠాలు నేర్చుకోవాలి. ఇక నుంచైనా సర్ పేరుతో ఏం చేసినా అర్హులైన ఓటర్ల జాబితా కోసమేనని కేవలం మాటలు చెప్పడం కాకుండా.. ఆచరణలోనూ అదే ఉద్దేశం కనిపించేలా జాగ్రత్తలు తీసుకోవాలి. ఆదరాబాదరాగా ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, స్వీకరణ కాకుండా.. తగినంత సమయం ఇవ్వాలి. బీఎల్వోలను మరింత మెరుగ్గా సన్నద్ధం చేయాలి. ఎన్యుమరేషన్ ఫారాల్లో భాష విషయంలోనూ జాగ్రత్తలు తీసుకోవాలి. చదువురానివారిని పక్కనపెడితే.. కనీసం చదువుకున్నవారికైనా తేలికగా అర్థమయ్యేలా ఫారాల్లో భాష ఉండటం అత్యవసరం. రాజకీయ పార్టీల ప్రతి అభ్యంతరాన్నీ తోసేయకుండా.. ఓసారి ఓటర్ల అభిప్రాయం కూడా తీసుకుని.. వాస్తవ సమస్యలపై దృష్టి పెట్టడం చాలా అవసరం. ఇలా జరిగిన పొరపాట్లు సరిదిద్దుకుంటేనే.. సర్ ప్రక్రియపై ఓటర్లకైనా విశ్వాసం కలుగుతుంది. లేకపోతే వారు కూడా పార్టీల మాదిరిగానే రకరకాల అనుమానాలు పెంచుకునే అవకాశం చేజేతులా ఈసీనే ఇచ్చినట్టవుతుంది.మన ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు విలువైనది. కాబట్టి సర్ ప్రక్రియ ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లు లేకుండా, పారదర్శకంగా సాగితేనే ప్రజల్లో ఎన్నికల వ్యవస్థపై విశ్వాసం పెరుగుతుంది. స్వయంప్రతిపత్తి కలిగిన ఎన్నికల సంఘం సర్ విషయంలో భవిష్యత్తులో మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలని తేటతెల్లమైంది. సర్ ప్రక్రియకు ఆయువుపట్టైన బీఎల్వోల ట్రైనింగ్ విషయంలో చాలా కసరత్తు చేయాల్సి ఉందని ప్రస్తుత సర్ స్పష్టం చేసింది. మొత్తం మీద తెలుగు రాష్ట్రాల్లో సర్ కారణంగా లాభనష్టాలు రెండూ ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు.సర్ పేరుతో నెలన్నర రోజుల పాటు హడావుడి చేసిన అధికారులు.. ఓటర్లను బాగా భయపెట్టిన మాట వాస్తవం. అదే సమయంలో లక్షల మంది ఓట్లు గల్లంతయ్యాయి. కాకపోతే ఓటు ఉంటే సరిపోదు.. అది పదిలంగా ఉండాలంటే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి.. ఎలాంటి వివరాలు గుర్తుంచుకోవాలని అనే విషయంలో ఓటర్లందరికీ పూర్తిస్థాయిలో అవగాహనకు వచ్చిందని చెప్పకతప్పదు. ఆ స్థాయిలో ఈసీ, అధికారులు నయానో, భయానో ఓటర్లకు అవగాహన కల్పించ ప్రయత్నం చేశారు. కాకపోతే ప్రయత్నలోపాలు చాలా ఉన్నాయి. అదేమంటే పెద్ద దేశం, జనాభా, భౌగోళిక సంక్లిష్టతలు లాంటి రెడీమేడ్ కారణాలు ఉండనే ఉన్నాయి. ఏతావాతా ఉత్తరాదితో పోలిస్తే తెలుగు రాష్ట్రాల్లో సర్ చాలా వరకు సజావుగా జరిగినట్టే అనే విశ్లేషణలున్నాయి. ముందే అనుకున్నట్టుగా హైదరాబాద్‌లో భారీగా ఓట్లు గల్లంతు కావటానికి కారణాలు అందరికీ తెలిసినవేనని చెబుతున్నారు. అలా చూసినప్పుడు.. సర్ మరీ విపరీతమైన షాక్ లేమీ ఇవ్వనట్టే. పనిలోపనిగా ఓటర్లందర్నీ ఓటు విషయంలో అప్రమత్తం చేసిందని చెబుతున్నారు. సర్ వివాదాస్పదంగా జరిగిందనే పేరొచ్చినా.. ఈ ప్రక్రియ కారణంగా ఇక ముందు ఓటర్లు ఓటుహక్కు విషయంలో మరిన్ని జాగ్రత్తలు తీసుకుంటారనే చర్చ జరుగుతోంది.మొన్నటిదాకా బీఎల్వోలు ఎవరో.. వారి విధులేమిటో చాలా మంది ఓటర్లకు అవగాహన లేదు. కానీ ఇప్పుడు మెజార్టీ ఓటర్లకు బీఎల్వోల పనేంటో తెలిసింది. భవిష్యత్తులో ఓటర్ల జాబితాలో ఏ తేడా వచ్చినా బీఎల్వోలను కలుస్తామని, అవసరమైతే తప్పులు దిద్దుకుంటామని కూడా ఓటర్లు చెబుతున్నారు. ఓటు విషయంలో అక్షరాస్యతతో సంబంధం లేకుండా చాలా మంది ఓటర్లకు అవగాహన లేని విషయాలు చాలా ఉన్నాయని సర్ కుండబద్దలు కొట్టింది. ఇప్పటి అనుభవాల ద్వారా.. ఓటర్లకు ఎలాంటి అవగాహన అవసరమో ఈసీకి కూడా ఓ ఐడియా వచ్చింది. ఒక్కో రాష్ట్రంలో ఒక్కో రకమైన సమస్యలు ఎదురుకావడం కూడా మంచిదేనని, తద్వారా ఈసారి సర్ నిర్వహణ సమయంలో రాష్ట్రాల వారీగా వ్యూహరచనకు వీలవుతుందని భావిస్తున్నారు. ఇప్పుడు గాడిదకూ, గుర్రానికీ ఒకే సూత్రం అన్వయించడం కూడా గందరగోళానికి, విమర్శలకు తావిచ్చిందని ఈసీ ఆలస్యంగా అర్థం చేసుకుంది. ఇక చివరిగా కేవలం సర్ సమయంలోనే ఓటర్ల జాబితా స్క్రూటినీ కాకుండా.. బీఎల్వోలు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ.. ఎప్పటికప్పుడు ఓటర్ల జాబితాలో అవాంఛిత మార్పుల్ని గమనించి.. ఎప్పటికప్పుడు సరిచేస్తే.. సర్ ప్రక్రియ ఈ స్థాయిలో అయోమయానికి దారితీసే పరిస్థితి ఉండదనే సూచనలో వాస్తవం లేకపోలేదు. ఏతావాతా ఈసీ తన పని తాను సమర్థంగా చేయకుండా.. బీఎల్వోల తప్పులకు కూడా ఓటర్లను బాధ్యుల్ని చేసే కాలం చెల్లిన నిబంధనలకు నీళ్లొదిలేసి.. ఇప్పటికైనా ఎవరి స్థాయిలో వారికి బాధ్యతలు నిర్దేశించే కొత్త రూల్స్‌కు రూపకల్పన చేయాలనే డిమాండ్ వినిపిస్తోంది.

# కొత్త రాజకీయ సమరం

గ్రామీణ పేదలకు ఉపాధి భద్రత కల్పించే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఇప్పుడు మరోసారి రాజకీయ చర్చకు కేంద్రంగా మారింది. పథకం అమలులో కేంద్రం-రాష్ట్రాల మధ్య వ్యయభారం మారడం కేవలం ఆర్థిక నిర్ణయం కాదు. ఇది సమాఖ్య వ్యవస్థ, రాష్ట్రాల ఆర్థిక స్వేచ్ఛ, గ్రామీణ సంక్షేమం, ఎన్నికల రాజకీయాలపై ప్రభావం చూపే అంశంగా మారుతోంది.గతంలో ఈ పథకానికి సంబంధించిన ప్రధాన వ్యయాన్ని కేంద్ర ప్రభుత్వం భరించేది. ఇప్పుడు రాష్ట్రాలు కూడా గణనీయమైన వాటాను భరించాల్సి రావడంతో ఇప్పటికే ఆర్థిక ఒత్తిడిలో ఉన్న రాష్ట్రాలపై అదనపు భారం పడుతోంది. ఒక రాష్ట్రానికి ఉపాధి కల్పన కోసం రూ.100 కోట్లు అవసరమైతే అందులో రూ.60 కోట్లు కేంద్రం, రూ.40 కోట్లు రాష్ట్రం భరించాల్సి వస్తే.. రాష్ట్ర బడ్జెట్‌పై దాని ప్రభావం తప్పదు.ఇక్కడే అసలు రాజకీయ ప్రశ్న మొదలవుతోంది. సామాజిక సంక్షేమ పథకాలకు సంబంధించిన ఆర్థిక బాధ్యతను కేంద్రం ఎంతవరకు భరించాలి? రాష్ట్రాలపై ఎంతవరకు మోపాలి?

### రాష్ట్రాలకు ఆర్థిక ధర్మసంకటం

ఈ మార్పు ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలకే సమస్య కాదు. బీజేపీ పాలిత రాష్ట్రాలు కూడా తమ బడ్జెట్లలో అదనపు నిధులు కేటాయించాల్సి వస్తే ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు నిధుల కొరత ఏర్పడే అవకాశం ఉంది.మరోవైపు ప్రతిపక్ష రాష్ట్రాలకు ఇది కేంద్రంపై రాజకీయ విమర్శలకు మరో అంశంగా మారుతోంది. అయితే రాష్ట్రాల పరిస్థితి కూడా అంత సులభం కాదు. ప్రజలకు ఉపాధి అవసరమైనప్పుడు “కేంద్రం నిధులు తగ్గించింది కాబట్టి పథకం అమలు చేయలేం” అని రాష్ట్రాలు చెప్పలేవు. గ్రామీణ ఓటరుకు కేంద్ర--రాష్ట్రాల ఆర్థిక వివాదం కంటే తమకు పని దొరుకుతుందా లేదా అన్నదే ముఖ్యం.అందుకే రాష్ట్రాలు తమ వాటాను కేటాయించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు కీలకం

ఉపాధి హామీ పథకాన్ని కేవలం సంక్షేమ కార్యక్రమంగా చూడటం సరైంది కాదు. వ్యవసాయ పనులు లేని సమయంలో గ్రామీణ పేదలకు ఇది ప్రత్యామ్నాయ ఆదాయ వనరుగా నిలుస్తోంది. కరువు, పంట నష్టాలు లేదా వ్యవసాయేతర ఉపాధి అవకాశాలు తగ్గినప్పుడు ఈ పథకం అనేక కుటుంబాలకు ఆర్థిక భరోసాను అందిస్తుంది.అంతేకాదు, కూలీలకు అందే డబ్బు గ్రామీణ దుకాణాలు, మార్కెట్లు, చిన్న వ్యాపారాలు, రవాణా రంగాల్లోకి వెళ్తుంది. అంటే ఉపాధి హామీ ద్వారా వచ్చే ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో కొనుగోలు శక్తిని పెంచుతుంది.కాబట్టి ఈ పథకానికి నిధులు తగ్గితే ప్రభావం లబ్ధిదారులకే పరిమితం కాదు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థపైనా దాని ప్రభావం పడే అవకాశం ఉంది.

### సంక్షేమంలో కేంద్రం-రాష్ట్రాల పోటీ

రాష్ట్రాలు తమ వాటాను కేటాయించడంతో పాటు ఉపాధి దినాలను పెంచేందుకు అదనపు నిధులు కేటాయిస్తే అది రాజకీయంగా కూడా ప్రాధాన్యత సంతరించుకుంటుంది. కేంద్రం తన వాటాను తగ్గిస్తే రాష్ట్రాలు “మేము పేదల కోసం అదనంగా ఖర్చు చేస్తున్నాం” అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే అవకాశం ఉంది.దీంతో ఉపాధి హామీ పథకం భవిష్యత్తులో కేంద్రం-రాష్ట్రాల మధ్య క్రెడిట్ వార్‌కు మరో వేదికగా మారే అవకాశం ఉంది.అయితే ప్రతి రాష్ట్రం ఆర్థిక పరిస్థితి ఒకేలా ఉండదు. కొన్ని రాష్ట్రాలకు ఆదాయ వనరులు బలంగా ఉంటే, మరికొన్ని రాష్ట్రాలు అప్పులు, వడ్డీ చెల్లింపులు, జీతాలు, పెన్షన్లు, ఇతర సంక్షేమ పథకాలతో ఇప్పటికే ఒత్తిడిలో ఉన్నాయి. అందువల్ల రాష్ట్రాల ఆర్థిక సామర్థ్యాన్ని పరిగణనలోకి తీసుకుని కేంద్రం వ్యయ విధానాన్ని రూపొందించాల్సిన అవసరం ఉంది.

### కేంద్రం పునరాలోచించాలి

కేంద్రం విధానంలో మార్పులు తీసుకురావడానికి ఆర్థిక కారణాలు ఉండవచ్చు. నిధుల వినియోగంలో పారదర్శకత, నకిలీ లబ్ధిదారుల నియంత్రణ, పనుల నాణ్యత, రాష్ట్రాల బాధ్యత వంటి అంశాలను బలోపేతం చేయడం అవసరమే.

కానీ సంస్కరణల పేరుతో పథకానికి అవసరమైన ఆర్థిక బలం తగ్గిపోకుండా జాగ్రత్త వహించాలి. గ్రామీణ పేదల ఆదాయం తగ్గితే వలసలు పెరగడం, స్థానిక మార్కెట్లలో కొనుగోలు శక్తి పడిపోవడం వంటి పరిణామాలు చోటుచేసుకోవచ్చు.ఉపాధి హామీపై కేంద్రం-రాష్ట్రాల మధ్య రాజకీయ విభేదాలు కొనసాగవచ్చు. కానీ ఆ రాజకీయ పోరాటం మధ్యలో గ్రామీణ పేదల ఉపాధి భద్రత బలహీనపడకూడదు.కేంద్రం తన వాటాపై పునరాలోచించాలి. రాష్ట్రాల ఆర్థిక పరిస్థితిని పరిగణనలోకి తీసుకోవాలి. రాష్ట్రాలు కూడా నిధుల వినియోగంలో పారదర్శకత, పనుల నాణ్యతపై బాధ్యత వహించాలి.ఎందుకంటే ఉపాధి హామీ అనేది కేవలం ఒక ప్రభుత్వ పథకం కాదు.. గ్రామీణ భారతదేశంలోని కోట్లాది కుటుంబాలకు కనీస ఆర్థిక భద్రత. రాజకీయాలు మారవచ్చు.. ప్రభుత్వాలు మారవచ్చు.. కానీ పేదల ఉపాధి భద్రత మాత్రం కొనసాగాలి.

సంపదకియం పేజీలో రచనలు పంపవలసిన వాట్సాప్ నంబర్ మెయిల్ ఐడి 9951512539
flashindia999@gmail.com

# పాన్ మసాలా ప్యాకింగ్‌పై కేంద్రం కీలక నిర్ణయం..

**న్యూ ఢిల్లీ :** పాన్ మసాలా ప్యాకింగ్, విక్రయాలకు సంబంధించి భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ కీలక నిబంధనలను తీసుకొచ్చింది. పర్యావరణ పరిరక్షణ, ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పాన్ మసాలా ప్యాకింగ్‌లో ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధిస్తున్నట్లుగా FSSAI గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది.

**అమల్లోకి రానున్న కొత్త రూల్స్ ఇవే..**

ఇక నుంచి పాన్ మసాలా ప్యాకింగ్ కోసం కేవలం కాగితం , పేపర్ బోర్డ్, సెల్యులోజ్, సహజసిద్ధంగా లభించే పదార్థాలను మాత్రమే ఉపయోగించాల్సి ఉంటుంది. పాలిథిలిన్, పాలిప్రొఫైలిన్, పాలిస్టర్, పాలీవినైల్ క్లోరైడ్ వంటి ఎలాంటి ప్లాస్టిక్, సింథటిక్ పాలిమర్లను, లామినేట్స్‌ను ప్యాకింగ్‌లో వాడకూడదు. ప్లాస్టిక్‌తో పాటు అల్యూమినియం ఫాయిల్ , ఇతర మెటలైజ్డ్ లేయర్లతో కూడిన ప్యాకింగ్‌ను కూడా FSSAI పూర్తిగా నిషేధించింది. కాగితం కవర్లతో పాటు టిన్ డబ్బాలు, గ్లాస్ కంటైనర్లలో పాన్ మసాలాను విక్రయించుకోవచ్చని వెల్లడించింది. ఈ మేరకు పర్యావరణ పరిరక్షణ చట్టం పరిధిలోని 'ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రూల్స్-2016'కు లోబడి ఉంటాయని FSSAI సీఈఓ రజిత్ పున్హానీ స్పష్టం చేశారు. అయితే, ఈ కొత్త ప్యాకేజింగ్ నిబంధనలకు సంబంధించి FSSAI ఏప్రిల్ 28న ముసాయిదాను విడుదల చేసిన విషయం తెలిసిందే. ప్రజలు, వ్యాపారుల నుంచి అభ్యంతరాలు, సలహాలు స్వీకరించిన అనంతరం కేంద్ర ప్రభుత్వ ఆమోదంతో ఇవాళ తుది నోటిఫికేషన్‌ను గెజిట్‌లో ప్రచురించారు. అయితే, ఈ నిబంధనలు గెజిట్‌లో ప్రచురితమైన రోజు నుంచే తక్షణం అమల్లోకి వస్తాయని నోటిఫికేషన్‌లో స్పష్టంగా పేర్కొన్నారు.

# హెచ్‌సీయూలో గంజాయి కలకలం..

## 17 మంది విద్యార్థులకు పాజిటివ్!




**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ)లో గంజాయి (డ్రగ్స్) వ్యవహారం కలకలం రేపింది. యూనివర్సిటీ ప్రాంగణంలో ఈగల్ టీమ్ సిబ్బంది నిర్వహించిన తనిఖీల్లో పలువురు విద్యార్థులు డ్రగ్స్ వినియోగించినట్లు గుర్తించారు. మొత్తం 17 మంది విద్యార్థులకు డ్రగ్ టెస్టుల్లో పాజిటివ్‌గా తేలింది. డ్రగ్స్ విక్రయిస్తున్న హెచ్‌సీయూ పూర్వ విద్యార్థి అరెస్ట్ అయ్యాడు. అతడి వద్ద నుంచి 10 గ్రాముల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈగల్ టీమ్‌కు అందిన సమాచారంతో హెచ్‌సీయూలో తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలోనే హెచ్‌సీయూ పూర్వ విద్యార్థి అరెస్ట్ అయ్యాడు. డ్రగ్ టెస్టుల్లో 17 మంది విద్యార్థులకు పాజిటివ్‌గా తేలింది. వారి వద్ద నుంచి గంజాయి వినియోగానికి సంబంధించిన వివరాలను అధికారులు సేకరించారు. విద్యార్థులకు గంజాయి ఎలా చేరుతోంది, ఎక్కడి నుంచి తీసుకొస్తున్నారు అనే అంశాలపై దర్యాప్తు చేపట్టారు. విచారణలో అస్సాం నుంచి గంజాయిని తీసుకొచ్చి యూనివర్సిటీ పరిసరాల్లో విక్రయిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఓ పెడ్లర్‌ను (హెచ్‌సీయూ పూర్వ విద్యార్థి) ఈగల్ టీమ్ విచారిస్తోంది. అతడికి గంజాయి సరఫరా చేస్తున్న వ్యక్తులు, నెట్‌వర్క్‌కు సంబంధించిన వివరాలను అధికారులు ఆరా తీస్తున్నారు. విద్యార్థుల్లో డ్రగ్స్ వినియోగం పెరగకుండా కట్టడి చేసేందుకు అధికారులు అన్ని చర్యలు చేపడుతున్నారు. హెచ్‌సీయూలో గంజాయి సరఫరా వెనుక ఉన్న పూర్తి నెట్‌వర్క్‌ను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు.

# ట్రెండ్ మారింది గురూ..

**సూర్యాపేట,ఫ్లాష్ ఇండియా :** స్త్రీలను గౌరవించడం మన సంప్రదాయం.. అంటూ గతంలో బస్టాండ్లు, బస్సుల్లో కనిపించే బోర్డులు ఇప్పుడు కనుమరుగవుతున్నాయి. తాజాగా సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్‌లో టీజీఎస్ ఆర్టీసీ ఏర్పాటు చేసిన ఓ బోర్డు ప్రయాణికుల దృష్టిని ఆకర్షిస్తోంది. దీంతో 'ట్రెండ్ మారింది గురూ..' అంటూ పలువురు ప్రయాణికులు సరదాగా వ్యాఖ్యానించుకుంటున్నారు. గతంలో ఆర్టీసీ బస్సులు, బస్టాండ్లలో మహిళలకు గౌరవం ఇవ్వాలని, వారికి కేటాయించిన సీట్లలో ఇతరులు కూర్చోకుండా చూడాలని సూచించే బోర్డులు దర్శనమిచ్చేవి. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, దివ్యాంగులకు కేటాయించిన సీట్లను వారికి మాత్రమే వదిలివేయాలని ఆర్టీసీ సూచనలు చేసేది. అయితే ప్రస్తుతం సూర్యాపేట కొత్త బస్టాండ్‌లో కనిపిస్తున్న బోర్డులో 'పురుషులను గౌరవించడం మన సంప్రదాయం.. వారికి కేటాయించిన సీట్లలో వారిని కూర్చోపెట్టండి' అనే సందేశం ఉండటంతో ప్రయాణికుల దృష్టి ఒక్కసారిగా దానిపై పడుతోంది. బస్టాండ్‌లో ప్రయాణిస్తున్న కొందరు ప్రయాణికులు ఈ బోర్డును ఆసక్తిగా గమనిస్తూ.. 'ఇంతకాలం మహిళలను గౌరవించాలనే బోర్డులు చూశాం.. ఇప్పుడు పురుషులను గౌరవించాలంటూ బోర్డు పెట్టడం కొత్తగా ఉంది' అంటూ సరదాగా




మాట్లాడుకుంటున్నారు. అయితే ఈ బోర్డు ఉద్దేశం ఏదైనా కావొచ్చు.. ప్రయాణికులకు కేటాయించిన సీట్లను సంబంధిత వ్యక్తులకే వదిలివేయాలనే సందేశం మాత్రం స్పష్టంగా కనిపిస్తోంది. సీట్లు ఎవరి కోసం కేటాయించబడ్డాయో వారికి కేటాయించిన సీట్లలో వారినే కూర్చోబెట్టడం ద్వారా ప్రయాణికులు పరస్పరం గౌరవించుకోవాలని ఆర్టీసీ సూచిస్తున్నట్లుగా భావించవచ్చు. మొత్తానికి సూర్యాపేట కొత్త బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన ఈ బోర్డు ప్రస్తుతం ప్రయాణికుల్లో చర్చనీయాంశంగా మారింది. కాలం మారింది.. ట్రెండ్ మారింది.. బోర్డుల సందేశం కూడా మారింది అంటూ పలువురు నవ్వుకుంటూ వ్యాఖ్యానించడం కనిపించింది.



# వరంగల్ జిల్లాలో డేంజరస్ స్నేక్..

**ఆంకోనిగూడెం,ఫ్లాష్ ఇండియా :** వరంగల్ జిల్లా ఖానాపురం మండలం ఆంకోనిగూడెం గ్రామంలోని అశోక్ నగర్‌లో అరుదైన పాము జనాల కంట పడింది. దాంతో స్థానికులు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. నలుపు, పసుపు రంగు చారలతో కనిపించిన ఈ పామును చూసిన స్థానికులు వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న అటవీ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని పామును పరిశీలించారు. పాము ఆకారం, శరీరంపై ఉన్న నలుపు--పసుపు చారలను పరిశీలించిన అధికారులు.. బాండెడ్ క్రైట్ (కట్టువిరియన్)గా గుర్తించారు. పాము సుమారు ఐదు అడుగుల పొడవు ఉన్నట్లు తెలిపారు. బాండెడ్ క్రైట్ విషపూరితమైన పాము అని అటవీ అధికారులు వెల్లడించారు. సాధారణంగా ఈ జాతి పాములు మహారాష్ట్ర ప్రాంతంలో ఎక్కువగా కనిపిస్తాయని, రాత్రి వేళల్లో ఎక్కువగా సంచరిస్తాయని తెలిపారు. స్థానికులు అప్రమత్తంగా ఉండాలని, మరిన్ని పాములు కూడా ఉండే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. దానిని చంపేందుకు లేదా పట్టుకునేందుకు ప్రయత్నించకుండా అటవీ శాఖకు సమాచారం అందించాలని సూచించారు. సాధారణంగా కనిపించే ప్రాంతానికి భిన్నంగా అశోక్ నగర్‌లో బాండెడ్ క్రైట్ దర్శనమివ్వడం అధికారులను ఆశ్చర్యానికి గురిచేసింది. అటవీ సిబ్బంది పామును సురక్షితంగా పట్టుకుని, అనంతరం పాకాల అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. వన్యప్రాణులు, పాములు జనావాసాల్లోకి వచ్చినప్పుడు వాటిని చంపకుండా అటవీ శాఖకు సమాచారం అందించాలని అధికారులు సూచించారు. అశోక్ నగర్ ప్రాంతంలో ఈ అరుదైన పాము కనిపించడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.



# వేటగాళ్ల విద్యుత్ ఉచ్చుకు ఫారెస్ట్ ఆఫీసర్ బలి!

**బూర్గంపాడు,ఫ్లాష్ ఇండియా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు అటవీ ప్రాంతంలో విషాదకర సంఘటన చోటుచేసుకుంది. అడవి జంతువుల కోసం వేటగాళ్లు అమర్చిన విద్యుత్ ఉచ్చులో చిక్కుకుని ఒక ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ (FBO) అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. అటవీ ప్రాంతంలో కొంతమంది వేటగాళ్లు వైర్లు అమర్చి అడవి జంతువుల కోసం ఉచ్చులు ఏర్పాటు చేశారనే సమాచారం ఫారెస్ట్ కార్యాలయానికి రావడంతో, ఆరుగురు సిబ్బంది కలసి అటవీ ప్రాంతంలోకి తనిఖీల కోసం నడుచుకుంటూ వెళ్లారు. బూర్గంపాడు మండలం నకిరేపేట అటవీ ప్రాంతంలో తనిఖీలు నిర్వహిస్తుండగా, వేటగాళ్లు అమర్చిన కరెంట్ తీగలు ప్రమాదవశాత్తు తగలడంతో పాల్వంచ ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని చెరువు సింగారం బీట్‌లో పనిచేస్తున్న FBO బానోత్ నవీన్ అక్కడికక్కడే మృతి చెందారు. మృతి చెందిన నవీన్ ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం వెంకట తండాకు చెందిన వ్యక్తిగా అధికారులు గుర్తించారు. విధి నిర్వహణలో ఉన్న అధికారి కరెంట్ ఉచ్చులకు బలవ్వడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు వేగవంతం చేశారు.

# వైద్య ఆరోగ్య శాఖ అస్తవ్యస్తం!

**నల్గొండ,ఫ్లాష్ ఇండియా :** జిల్లాలోని వివిధ ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న సిబ్బంది, అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. విధులకు దుమ్మా కొట్టినా, పదవీ విరమణ పొందినా, ఎలాంటి అధికారిక ఉత్తర్వులు లేకుండానే తమకు అనుకూలమైన చోటికి స్థానచలనం పొందుతూ కాలం వెళ్లదీస్తున్నారు. పర్యవేక్షించాల్సిన జిల్లా స్థాయి అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడమే కాకుండా, అక్రమార్కులకు వెన్నుదన్నుగా నిలుస్తున్నారనే తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**రిటైర్ అయినా తీరని వేతన ప్రేమ...**

నాగార్జున సాగర్ ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న ఓ ఉద్యోగి జూన్ నెలలోనే పదవీ విరమణ పొందారు. సహచర సిబ్బంది ఆయనకు ఘనంగా సన్మానం చేసి సాగనంపగా, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం దరఖాస్తులు కూడా చేసుకున్నారు. నిబంధనల ప్రకారం జూలై నుంచి ఆయనకు జీతం నిలిపివేయాలి. కానీ, అధికారులు, సిబ్బంది కంటితుడుపు తనిఖీలతో తెలిసీ కూడా జూలై నెల వేతన బిల్లులను తయారు చేసి మంజూరు చేశారు. ప్రతి ఫైలును నిశితంగా పరిశీలించే అధికారులు ఈ విషయంలో క్రాస్ చెక్ చేయకపోవడం వెనుక పెద్దఎత్తున అవినీతి దాగి ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**సరెండర్ కాగితాలు కప్పిపుచ్చి.. మళ్లీ పాత చోటుకే..!**

మరోవైపు ఓ సివిల్ సర్జన్ డాక్టర్ సుమారు ఆరు నెలలుగా విధులకు హాజరు కాకుండా దుమ్మా కొట్టారు. ఆ వైద్యుడికి శిక్ష (పనిష్మెంట్) కింద నల్గొండ డీసీహెచ్ కార్యాలయానికి సరెండర్ చేస్తూ లేఖ ఇచ్చారు. అయితే డీసీహెచ్ఎస్ అధికారి ఆ లెటర్‌ను బయటకు రాకుండా కప్పిపుచ్చి, ఉన్నతాధికారులకు పంపకుండా అడ్డుకున్నారని సమాచారం. కనీస చర్యలు తీసుకోకపోగా, ఏ ఆస్పత్రిలో విధులకు ఎగ్గొట్టి సరెండర్ అయ్యారో అదే ఆస్పత్రిలో సదరు డాక్టర్ తిరిగి విధుల్లో చేరడం గమనార్హం. ఈ వ్యవహారం వెనుక జిల్లాస్థాయి అధికారికి భారీగా ముడుపులు ముట్టినట్లు ప్రచారం సాగుతోంది.

**అధికారిక ఉత్తర్వులు లేకుండానే డిప్యూటేషన్..**

దేవరకొండ ఏరియా ఆస్పత్రిలో కాంట్రాక్టు ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న ఓ వ్యక్తి, ఓ వైద్యాధికారి సొంత క్లినిక్‌లోనూ సేవలు అందిస్తున్నట్లు తెలుస్తోంది. తన సొంత క్లినిక్‌కు అనుకూలంగా ఉండేందుకు, దేవరకొండలో ల్యాబ్ టెక్నీషియన్ అవసరం తీవ్రంగా ఉన్నప్పటికీ పట్టించుకోకుండా.. ఎలాంటి అధికారిక ఆదేశాలు లేకుండానే సదరు ఉద్యోగిని నకిరేకల్ ఆస్పత్రికి డిప్యూటేషన్‌పై పంపించారు. అంతేకాక జిల్లాలో ఎవరి బదిలీలు జరగాలన్నా ఈ టెక్నీషియనే నిర్ణయిస్తుండడం గమనార్హం.

**వ్యవస్థీకృత అవినీతిపై స్పందించరా..?**

ప్రజల ప్రాణాలను కాపాడాల్సిన వైద్యారోగ్య శాఖలో ఈ తరహా అక్రమాలు వెలుగుచూడడం అధికారుల బాధ్యతారాహిత్యానికి నిదర్శనం. నిబంధనలను పాతిపెట్టి జీతాలు ఇవ్వడం, సరెండర్ లేఖలను తొక్కిపెట్టడం, ఇష్టారాజ్యంగా డిప్యూటేషన్లు వేసుకోవడం వెనుక పెద్దఎత్తున నెట్‌వర్క్ నడుస్తోందనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. నల్గొండ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రుల్లో నడుస్తున్న ఈ 'అక్రమాల పుట్ట'పై రాష్ట్ర వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులు, కలెక్టర్ తక్షణమే స్పందించి ఉన్నతస్థాయి విచారణ జరిపించాలి. అక్రమాలకు సహకరించిన అధికారులను సస్పెండ్ చేసి, ప్రభుత్వ ధనాన్ని రికవరీ చేయాలని స్థానికులు కోరుతున్నారు.

# రూ.10వేలు కొట్టు పెన్షన్ పట్టు

**నిజామాబాద్,ఫ్లాష్ ఇండియా :** ప్రభుత్వం కొత్తగా మంజూరు చేయనున్న ఆసరా పెన్షన్లకు పైరవీకారుల బెడద పట్టుకుంది. కాదేదీ కరప్షన్ కు అనర్హం అన్నట్లుగా అధికార పార్టీకి చెందిన చోటా మోటా నాయకులు, పైరవీకారులు, గ్రామస్థాయి కార్యకర్తలు సైతం ఆసరా పెన్షన్లను తమకు ఆదాయ వనరుగా మార్చుకునేందుకు పథకం రచిస్తున్నారు. ఇప్పటికే ఆసరా పెన్షన్లు ఇప్పిస్తామంటూ ఆశావహులకు గాలం వేస్తున్నారు. ధరను కూడా డిసైడ్ చేసినట్లు తెలుస్తోంది. ఆసరా పెన్షన్లు మంజూరు చేయించేందుకు ఒక్కొక్కరి వద్ద రూ. 10 వేలు గంప గుత్తగా ముందే తీసేసుకుంటున్నారని, దరఖాస్తు ప్రక్రియ నుంచి మొదలుకుని పెన్షన్ మంజూరయ్యే వరకు తమదే బాధ్యత అంటూ ఆశావహుల నుండి ముందుగానే రూ. 10 వేలు తీసుకుంటున్నట్లు విశ్వసనీయంగా తెలుస్తోంది. ఆర్మూర్, బాల్కొండ, ధర్పల్లి, తదితర నియోజకవర్గ పరిధిలోని గ్రామాల్లో అధికార పార్టీకి చెందిన కార్యకర్తలు, పైరవీకారులు ఆసరా పెన్షన్లు మంజూరు చేయించి ఇస్తామంటూ ఇప్పటికే పెద్ద మొత్తంలో ఆశావహుల నుంచి వసూలు చేసినట్లు ఆరోపణలున్నాయి. నిజామాబాద్, బోధన్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కూడా కొంత మంది ముఠాగా ఏర్పడి ఈ తతంగం నడిపిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే చాలా మంది వద్ద పెద్ద మొత్తంలో వసూలు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో ఇందిరమ్మ ఇళ్ల పథకంలో కూడా ఇళ్లు మంజూరు చేయిస్తామని లబ్ధిదారుల నుండి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొన్న వారే ఇప్పుడు ఆసరా పెన్షన్ల కోసం కూడా అదే దందాకు తెరలేపినట్లు తెలుస్తోంది. ఆసరా పెన్షన్ కు అర్హత లేకున్నా గ్రామ స్థాయి అధికారుల నుండి మండల స్థాయి అధికారులను మేనేజ్ చేసి పెన్షన్లు మంజూరు చేయించి ఇస్తామంటూ కొందరి వద్ద రూ. 20 వేల వరకు ముందస్తు అడ్వాన్సులుగా తీసుకున్నట్లు టాక్ వినిపిస్తోంది. వృద్ధాప్య పెన్షన్ల కోసమే చాలా మంది పైరవీకారులకు డబ్బులు చెల్లించారని, ఇప్పుడు ప్రభుత్వం వృద్ధాప్య పెన్షన్లు ఇవ్వడం లేదని తెలిసి, తాము చెల్లించిన డబ్బులు తిరిగి వస్తాయో లేదోనని ఆందోళన చెందుతున్నారు. పెన్షన్ల కోసం డబ్బులిచ్చిన వారు తీవ్ర ఆందోళనలో ఉన్నట్లు తెలుస్తోంది. తాను బయటి నుంచి అప్పుగా తెచ్చి ఇచ్చానని, ఇప్పుడు నాకు పెన్షన్ రాకపోతే నేనిచ్చిన డబ్బులు తిరిగి ఇస్తారా అంటూ బేలగా ఓ మహిళ తన దగ్గరికి వచ్చిన వారితో చెప్పుకుని బాధపడుతోందని పలువురు చెపుతున్నారు.

**జిల్లాలో దాదాపు 30 వేలకు పైగా వృద్ధులు**

రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఆసరా పెన్షన్లు మంజూరు చేసేందుకు సిద్ధమైంది. ఇందుకోసం అర్హులైన వారిని కొత్తగా దరఖాస్తు చేసుకోవడానికి అవకాశమిచ్చింది. ఎంతో కాలంగా ఆసరా పెన్షన్ల కోసం కళ్లు కాయలు కాచేలా ఎదిరిచూస్తున్న వృద్ధులు, బీడీ కార్మికులకు ప్రభుత్వం కొత్తగా జారీ చేసే పెన్షన్లలో దరఖాస్తుకు అవకాశమివ్వకపోవడంతో తీవ్ర నిరాశ చెందుతున్నారు. ఆసరా పెన్షన్ల కోసం తమను రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు వేరు చేసి చూస్తోందని ఆవేదన చెందుతున్నారు. నిజామాబాద్ జిల్లాలో ప్రస్తుతం 2,63,487 మంది వివిధ కేటగిరీలలో ఆసరా పెన్షన్లు పొందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెలా జిల్లాలో రూ. 56.73 కోట్లు పెన్షన్లు పంపిణీ చేస్తోంది. ఇందులో 63,952 మంది వృద్ధులు, 71,720 మంది వితంతువులు, 173 మంది చేనేత కార్మికులు, 949 మంది గీత కార్మికులు, 94,866 మంది బీడీ కార్మికులు, 9,953 మంది ఒంటరి మహిళలు, 986 మంది బీడీ టేకేదార్లు, 1975 మంది కళాకారులు, 356 మంది ఫైలేరియా బాధితులు, 485 మంది డయాలసిస్ పేషంట్లు ఆసరా పెన్షన్లు పొందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తున్న ఆసరా పెన్షన్లు అనర్హుల చేతిలోకి వెళ్లి పక్కదారి పడుతున్నాయనే ఉద్దేశంతో ఆసరా లబ్దిదారుల్లో నకిలీలను ఏరివేసే ప్రక్రియను చేపట్టారు. ఇందులో భాగంగా అథెంటికేషన్ ప్రక్రియలో నిజమైన ఆసరా లబ్దిదారులను గుర్తిస్తున్నారు. జిల్లాలో ఇప్పటికే చాలా మంది ఆసరా లబ్దిదారులు చనిపోయినప్పటికీ వారి పేరు మీద కూడా ఆసరా పెన్షన్లు పంపిణీ జరుగుతోందని అధికారులు గుర్తించారు. అలాంటి వాటన్నింటినీ గుర్తించి ఆసరా పెన్షన్లు పక్కదోవ పట్టకుండా అడ్డుకట్ట వేసేందుకు అధికార యంత్రాంగం పకడ్బందీగా పని చేస్తోంది. జిల్లాలో ఇప్పటి వరకు చనిపోయిన లబ్దిదారులను 2,322మందిని గుర్తించారు. 3,864మంది ఆసరా లబ్దిదారులెవరనేది ఇప్పటి వరకు గుర్తించలేకపోయారు. నాట్ ట్రేసేబుల్ గా నమోదు చేసుకున్నారు. నిజామాబాద్ కార్పొరేషన్ పరిధిలో 3,651 మంది నాట్ ట్రేసేబుల్ పెన్షనర్స్ కాగా, ఆర్మూర్ మున్సిపాలిటీ పరిధిలో 161 మంది, బోధన్ పరిధిలో 44మంది ఉన్నారు. చనిపోయిన లబ్దిదారుల్లో కూడా నిజామాబాద్ పరిధిలోనే ఎక్కువగా 1,486 మంది ఉన్నారు. బోధన్ లో 540 మంది, ఆర్మూర్ లో 196 మంది ఉన్నారు. భీమ్‌గల్ లో ఏడుగురిని మాత్రమే చనిపోయినట్లు గుర్తించారు.

**నిరాశను మిగిల్చిన ఎదురుచూపులు**

ఆసరా పెన్షన్ల కోసం ఎంతో కాలంగా ఎదిరిచూస్తున్న వృద్ధులు, బీడీ కార్మికుల ఎదురుచూపులు చివరకు నిరాశే మిగిల్చాయి. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 57 ఏళ్లు నిండిన వారికి వృద్ధాప్య పెన్షన్లు ఇస్తామని అప్పటి సీఎం కేసీఆర్ ప్రకటించారు. అప్పటి నుంచి 57 ఏళ్లు నిండిన వారు వేలల్లో ఆసరా పెన్షన్ల కోసం ఎదిరి చూస్తున్నారు. కేసీఆర్ హయాంలో దక్కని పెన్షన్లు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనైనా దక్కుతాయేమోనని ఆశగా ఎదిరిచూస్తున్న వారికి రేవంత్ ప్రభుత్వం నిరాశే మిగిల్చింది. ఆసరా పెన్షన్ల లో వృద్ధులకు, బీడీ కార్మికులకు చోటివ్వక పోవడంతో వారి ఆశలు ఆవిరై పోయాయి.

# బీఆర్ఎస్ నిలదీస్తే గానీ సోయి రాదా?

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** బీఆర్ఎస్ నిలదీస్తే గానీ సోయి రాదా రేవంత్ రెడ్డి? తెలంగాణ ప్రాజెక్టులను అడ్డుకోవాలని ఏపీ ప్రభుత్వం జీఆర్ఎంబీ ఎజెండాలో పెడితే.. ఇంతకాలం ఎందుకు నోరు మెదపలేదు? అని మాజీ మంత్రి హరీష్ రావు నిలదీశారు. తెలంగాణకు సంబంధించిన 7 ప్రాజెక్టులను నిలుపుదల చేయాలని ఏపీ ప్రతిపాదిస్తే.. తెలంగాణ ప్రభుత్వం ఎందుకు వెంటనే అభ్యంతరం చెప్పలేదని ఎక్స్ పోస్ట్‌లో ప్రశ్నించారు. ఎందుకు జీఆర్ఎంబీ ని నిలదీయలేదు? ఎందుకు ఏపీ ప్రభుత్వాన్ని ప్రశ్నించలేదు? బీఆర్ఎస్ ప్రశ్నించిన తర్వాత హడావుడిగా లేఖలు రాయడం తప్ప.. తెలంగాణ ప్రయోజనాల పట్ల మీకు అసలు చిత్తశుద్ధి లేదా? అని నిలదీశారు. చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్టు.. మీ నామమాత్రపు లేఖలు తెలంగాణ ప్రాజెక్టులను కాపాడుతాయా? లేఖలతో పనులు కావు. తెలంగాణ నీటి ప్రయోజనాల కోసం రాజీలేని పోరాటం చేయాలన్నారు. "ఏపీ ప్రభుత్వం జీఆర్ఎంబీ ఎజెండాలో పెట్టిన అంశాలను వెంటనే వెనక్కి తీసుకోవాలి. అవి ఎజెండా నుంచి తొలగించే వరకు తెలంగాణ ప్రభుత్వం పట్టుబట్టాలి. అవసరమైతే.. ఆ అంశాలు వెనక్కి తీసుకోకపోతే జీఆర్ఎంబీ సమావేశానికి హాజరు కాబోమని కరాఖండిగా తేల్చి చెప్పాలి. అలా కాకుండా మీ రాజకీయ అవసరాల కోసం మీటింగ్‌కు వెళ్లి.. అక్కడ తెలంగాణ ప్రాజెక్టులపై ఏపీ పెట్టిన అభ్యంతరాలకు బలం చేకూర్చేలా వ్యవహరిస్తే మాత్రం బీఆర్ఎస్ చూస్తూ ఊరుకోదు. రేవంత్ రెడ్డి.. ఇది రాజకీయాలకు సంబంధించిన విషయం కాదు. తెలంగాణ భవిష్యత్తుకు సంబంధించిన విషయం. తెలంగాణ నీటి హక్కులకు సంబంధించిన విషయం. ప్రతిపక్షాలపై పిచ్చి ప్రేలాపనలు చేసే రేవంత్ రెడ్డి.. రాష్ట్ర ప్రాజెక్టులపై ఏపీ అభ్యంతరాలు చెబితే ఎందుకు నోరు మెదపడం లేదు? ఈ నెల 18న హైదరాబాద్‌లో జరిగే జీఆర్ఎంబీ సమావేశం ఎజెండాను ఉపసంహరించుకోకుండా నిర్వహిస్తే.. తెలంగాణ ప్రాజెక్టులను కాపాడుకోవడం కోసం బీఆర్ఎస్ పార్టీ వేలాది మందితో జీఆర్ఎంబీ కార్యాలయాన్ని ముట్టడిస్తుందని హెచ్చరిస్తున్నాం. కేంద్రం చేతిలో ఉన్న జీఆర్ఎంబీ, చంద్రబాబు, రేవంత్ కలిసి తెలంగాణకు చేస్తున్న జల ద్రోహాన్ని అడ్డుకుంటాం." అని మాజీ మంత్రి హరీష్ రావు ప్రభుత్వాన్ని నిలదీశారు.

# ఏఐఎస్ఎఫ్ 91వ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు




**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :**
మిర్యాలగూడ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఏఐఎస్ఎఫ్ 91వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ముందుగా సారియా అనే విద్యార్థిని జెండాను ఆవిష్కరించారు. అనంతరం సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు,మాజీ ఏఐఎస్ఎఫ్ నాయకులు పొదిల శ్రీనివాస్,జిల్లా యాదగిరి లను ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా ఏ ఐ ఏస్ ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు జిల్లా యశ్వంత్ మాట్లాడుతూ గత 91 ఏళ్లుగా విద్యార్థుల హక్కుల కోసం రాజీలేని పోరాటాలను నిర్వహిస్తుందన్నారు. ప్రభుత్వం పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్లు ఫీజు రియంబర్స్మెంట్ ను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు సంతోష్,రామ్ చరణ్,అబ్దుల్,ఏఐవైఎఫ్ నాయకులు ఆకారపు లోకేశ్,కార్తీక్,బంటు లోకేశ్ అలగే విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు



## తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరి పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ యూనియన్ పంచాయతీ రాజ్ జిల్లా కార్యదర్శిగా ఎస్.జానారెడ్డి

**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :**
తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ యూనియన్ పంచాయతీ రాజ్ జిల్లా కార్యదర్శిగా ఎస్.జానారెడ్డి నియమితులయ్యారు. చిట్యాల ఎంపీడీవో కార్యాలయంలో పని చేస్తున్న జానారెడ్డికి బుధవారం అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అంజయ్య, ఉపాధ్యక్షుడు కిరణ్, నల్లగొండ జిల్లా అధ్యక్షులు కరుణాకర్గౌడ్లు నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్కుమార్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు సోమనాథ్,సైదులు,ఫణి, హరిప్రసాద్ పాల్గొన్నారు. అనంతరం జానారెడ్డిని సన్మానించారు.

# అల్పాహారం అందజేయడం అభినందనీయం




**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :**
నల్లగొండ లయన్స్ క్లబ్ ఫ్రీ మీల్స్ పౌండేషన్ ఆద్వర్యంలో బుధవారం నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రిలో రోగుల సహాయకులకు 1500 రోజులుగా అల్పాహారం అందజేయడం అబినందనీయమని నల్లగొండ మేయర్ బుర్రి చైతన్య, పౌండేషన్ చైర్మన్ జగిని భీమయ్యలు అన్నారు. నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రిలో అల్పాహారం అందజేసిన అనంతరం రోగుల సహాయకులకు జ్యూట్ బ్యాగులు అందజేశారు. కార్యక్రమంలో కోడె సతీష్కుమార్,కె.వి. ప్రసాద్, నేతి రఘుపతి, శివశంకర్రావు,శ్రవణ్కుమార్,గట్టుపల్లి రవీందర్రెడ్డి,అశోక్రెడ్డి,స్వామి, నాగిరెడ్డి,పాషా తదితరులు పాల్గొన్నరు.



## బీసీలు రాజ్యాధికార దిశగా ముందుకు వెళ్లాలి..

**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :**
తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను ప్రతి రంగంలో అణిచివేయడాన్ని నిరసిస్తూ మిర్యాలగూడలో బీసీ యువజన సంఘం సమావేశంలో బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ నాటి నుండి నేటి వరకు కూడా ప్రతి రంగంలో బీసీలను అవమానిస్తూ అణిచివేస్తున్నారు,
చదువుకునే విద్యార్థులకు స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయకుండా బీసీ విద్యార్థులను చదువులకు దూరం చేస్తున్నారు.బీసీలకు చట్ట సభలలో జనాభా ప్రాతినిధ్య ప్రకారం రిజర్వేషన్లు కావాలని ఎంతోకాలంగా ఉద్యమిస్తున్నప్పటికీ కూడా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎందుకు స్పందించడం లేదు అని ఆయన అన్నారు.బీసీ లు కేవలం ఓటు బ్యాంకు గానే వాడుకుంటూ ప్రభుత్వాలు గద్దెనిక్కుతున్నాయి తప్ప బీసీలను పట్టించుకున్న పాపాన పోవడం లేదు అని ఆయన అన్నారు.జనాభాలో అత్యధికంగా ఉన్నటువంటి బీసీలు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే ఓట్లు ఉన్నప్పటికీ ఇంకా బీసీ లం బానిసలుగా బతకాలా అంటూ ఎంతోమంది విద్యార్థులు యువకులు మేధావులు ముందుకు వస్తున్న సందర్భం తెలంగాణలో బీసీల ప్రభుత్వం ఏర్పాటు దిశగా బీసీలందరూ ముందుకు సాగుతున్నారు అని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్క నాగేశ్వ-రరావు,బిసి యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎర్రబెల్లి గంగాధర్,బీసీ యువజన సంఘం పట్టణ నాయకులు సతీష్,రాంబాబు, ఉపేందర్,రాజు,శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## రక్తదాన శిబిరానికి హాజరవ్వాలని చౌటుప్పల్ డిఎస్పికి ఆహ్వాన పత్రిక అందజేత



**వలిగొండ, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** మండల పరిధిలోని వెలువర్తి గ్రామంలో వెలువర్తి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ఆగస్టు15న నిర్వహిస్తున్న రక్తదాన శిబిరానికి చౌటుప్పల్ డిఎస్పి మధుసూదన్ రెడ్డిని ఆహ్వానించడం జరిగింది. ఈ సందర్భంగా వెల్వర్తి యూత్ అసోసియేషన్ అధ్యక్షులు కూచిమల్ల సుధాకర్ మాట్లాడుతూ రక్తదాన శిబిరాన్ని యాదాద్రి తలసేమియా బ్లడ్ సెంటర్ మరియు యశోద హాస్పిటల్ డాక్టర్లచే హెల్త్ చెకప్ సదన్ ఐస్ కేర్ హాస్పిటల్ హైదరాబాద్ వారి సమక్షంలో నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వెలువర్తి యూత్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లం నరేష్, బూడిద రాజు, ప్రధాన కార్యదర్శి కూచిమల్ల నాగేష్, కోశాధికారి మల్లం సాయి, కార్యదర్శి మల్లం మహేష్, కలుకూరి విక్రమ్, కలుకూరి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# జీతాలలో కోత సరే..చికిత్సలు ఏవి సారు..

**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** ఉద్యోగ,ఉపాధ్యాయ,పెన్షన్ దార్లకు మెరుగైన వైద్య చికిత్స అందించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవచ్చిన ఉద్యోగ,ఉపాధ్యాయ పెన్షనర్ల హెల్త్ కార్డులు ఇప్పటికీ డౌన్లోడ్ కావడం లేదని,చికిత్సలు అందించడం లేదని అయినప్పటికీ మూడు నెలలుగా వేతనాలలో కోత విధించి ఇబ్బందులకు గురి చేయడం ఎంతవరకు సమంజసమని బంజారా ఉద్యోగుల సంఘం తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ మాలోతు దశరథ నాయక్ ప్రశ్నించారు. బుధవారం మిర్యాలగూడలో నిర్వహించిన బంజారా ఉద్యోగుల సంఘ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఉద్యోగ,ఉపాధ్యాయ,పెన్షన్ దార్లకు కార్పొరేట్ వైద్యం అందించడం కోసం వారి వేతనంలో బేసిక్ పే లో 1.5శాతం తీసుకుని మూడు నెలలు దాటిన చికిత్సలు అందించకపోవడం ఎంత వరకు సమంజసమని అన్నారు.ఒకవైపు చికిత్సలు అందించే విషయంలో ప్రైవేటు,కార్పొరేట్ ఆసుపత్రులతో సరైన ఒప్పందం చేసుకోక పోవడం మరోవైపు చికిత్స అందించకుండానే వేతనాల్లో కోత విధించడం ఉద్యోగ,ఉపాధ్యాయ,పెన్షన్ దారులను అవమానాలకు గురి చేయడం లాంటిదేనని అన్నారు.ఇప్పటికే లక్షలాదిమంది ఉద్యోగ,ఉపాధ్యాయ,పెన్షన్ దారులు కార్డులు డౌన్లోడ్ అవుతాయోమో అని ఆశతో నెట్ సెంటర్ లో చుట్టూ తిరుగుతున్నారని,కొంతమంది ఉద్యోగఉపాధ్యాయులు,పెన్షన్ దారులు చికిత్సల కోసం ప్రైవేటు,కార్పొరేట్ ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారని అన్నారు.చికిత్సలు అందించకుండానే వేతనంలో కోత విధించిన మే,జూన్,జూలై నెలల వేతనాలను తిరిగి ఉద్యోగుల,పెన్షన్ దార్ల ఖాతాలో జమ చేయాలని డిమాండ్ చేశారు.ఉద్యోగుల హెల్త్ స్కీమ్ కమిటీలో సభ్యులుగా ఉన్న వివిధ సంఘాల సంఘాల నాయకులు ఈ విషయమై నోరు మెదపకపోవడంలో ఉన్న ఆంతర్యం ఏమిటి అని ఆయన ప్రశ్నించారు.హెల్త్ కార్డుల జారీ చికిత్సలు అందించే విషయంలో ప్రభుత్వం తక్షణం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.సమావేశంలో బంజారా ఉద్యోగుల సంఘం నాయకులు మక్ల, సైదా,జామ్లా లక్ష్మణ్ నాయక్, శ్రీను నాయక్,చీనా నాయక్,రమేష్ లాలు తదితరులు పాల్గొన్నారు.

# రైతులు అధిక ఆదాయం పొందేలా ప్రోత్సహించాలి





**జనగాం,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** బహుళ అంతస్తుల సాగు విధానాలతో రైతులు అధిక ఆదాయం పొందేలా ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు.బుధవారం, జిల్లాలోని రఘునాథపల్లి మండలం, కోమల్ల గ్రామంలో బహుళ అంతస్తుల వ్యవసాయ విధానంలో వివిధ రకాల పంటలను సాగు చేస్తున్న రైతు మంద రాములు వ్యవసాయ క్షేత్రాన్ని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సందర్శించారు. సుమారు రెండు ఎకరాల విస్తీర్ణంలో రైతు చేపడుతున్న వివిధ రకాల పంటల సాగు విధానం, సాగునీటి సదు-పాయాలు, పంటల నిర్వహణ, దిగుబడులు, మార్కెటింగ్, తదితర అంశాలను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ వ్యవసాయ క్షేత్రంలో మునగ, సపోటా, సీతాఫలం, అరటి, అంజీర్, నిమ్మ వంటి ఉద్యాన పంటలతో పాటు బీరకాయ, సొరకాయ, తదితర కూరగాయల పంటలను రైతు సాగు చేస్తున్నట్లు కలెక్టర్ కు వివరించారు. ఒకే భూమిలో వివిధ రకాల పంటలను సాగు చేస్తూ అదనపు ఆదాయం పొందే విధంగా చేపడుతున్న బహుళ అంతస్తుల సాగు విధానాన్ని కలెక్టర్ పర్యవేక్షించారు.రైతుతో మాట్లాడిన కలెక్టర్, వివిధ పంటల సాగుకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఏమైనా సబ్సిడీ (లేదా) ఇతర ప్రోత్సాహకాలు అందాయా? సాగు కోసం రైతు చేసిన పెట్టుబడి ఎంత? పంటల నిర్వహణకు ఎంత ఖర్చు అవుతోంది? అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు.వ్యవసాయ క్షేత్రానికి ఏర్పాటు చేసిన డ్రిప్ ఇరిగేషన్ సదుపాయం గురించి కూడా ఆరా తీశారు. పంటలకు అవసరమైన నీటిని పొదుపుగా వినియోగి-స్తూ, ప్రతి మొక్కకు తగిన మోతాదులో నీరు అందేలా డ్రిప్ వ్యవస్థను సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు.వ్యవసాయ క్షేత్రంలో ఏర్పాటు చేసిన మోటార్కు సంబంధించిన ఖర్చు, నీటి లభ్యత, సాగునీటి వినియోగ విధానాన్ని కూడా కలెక్టర్ ఆరా తీశారు. తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంటలను సాగు చేసేలా ఆధునిక సాగు పద్ధతులను రైతులు విస్తృతంగా వినియోగించుకోవాలని సూచించారు.కూరగాయలు, ఇతర పంటల ఉత్పత్తులను ప్రస్తుతం ఎక్కడ విక్రయిస్తున్నారో రైతును అడిగి తెలుసుకున్న కలెక్టర్, పంటలకు మెరుగైన మార్కెటింగ్ సదుపాయాలు కల్పించడంపై దృష్టి సారించాలని వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులను ఆదేశించారు. రైతులు పండించిన ఉత్పత్తులకు స్థానికంగా మా-త్రమే కాకుండా సమీప మార్కెట్లు, రైతు బజార్లు, ఇతర విక్రయ కేంద్రాల్లో మెరుగైన ధర లభించేలా మార్కెటింగ్ అవకాశాలను అన్వేషించాలని సూచించారు.పంటలను పురుగులు, తెగుళ్ల నుంచి రక్షించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. పంటలపై క్రమం తప్పకుండా పర్యవేక్షణ నిర్వహిస్తూ, పురుగుల ఉద్ధృతి గుర్తించిన వెంటనే వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారుల సలహాలు తీసుకొని, తగిన నివారణ చర్యలు చేపట్టాలని తెలిపారు. అదే విధంగా పొలంలో కలుపు మొక్కలను ఎప్పటికప్పుడు తొలగిస్తూ, పంటల పెరుగుదలకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పించాలని సూచించారు.కూరగాయల పంటలకు అవసరమైన పందిర్లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. బీరకాయ, సొరకాయ, వంటి తీగజాతి కూరగాయలకు పందిర్లు ఏర్పాటు చేయడం ద్వారా మొక్కల పెరుగుదల మెరుగుపడి, పంట నాణ్యత పెరగడంతో పాటు పురుగులు, తెగుళ్ల ప్రభావాన్ని కొంత మేర నియంత్రించవచ్చని తెలిపారు. రైతుకు అవసరమైన పందిర్ల ఏర్పాటుకు సంబంధించిన ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలను పరిశీలించి, అర్హత మేరకు సహాయం అందించాలని అధికారులను ఆదేశించారు.గ్రామంలో ఇలాంటి వినూత్న వ్యవసాయ పద్ధతులను అవలంబిస్తున్న రైతులను గుర్తించి, వారి అనుభవాలను ఇతర రైతులకు తెలియజేయాలని అధికారులకు సూచించారు.ఈ పరిశీలనలో డీఏఓ అంబికా సోనీ, డీఆర్డీఓ భాస్కర్, కేవీకే శా-స్త్రవేత్త రమ్య, ఉద్యానవన శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ స్కాలర్షిప్ లను వెంటనే విడుదల చేయాలి...




**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ మిర్యాలగూడ డివిజన్ కమిటీ సమావేశం మిర్యాలగూడ పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్షుడు జగన్ నాయక్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది.ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఖమ్మంపాటి శంకర్,మూడవత్ రవి నాయక్ పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పేద విద్యార్థులకు విద్య అందని ద్రాక్షలా మారుస్తుందని ఆరోపించారు. ఇప్పటికీ రాష్ట్రంలో బకాయిలో ఉన్న 10,500 కోట్ల స్కాలర్షిప్లు ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయకుండా విద్యార్థుల పట్ల సవతి తల్లి ప్రేమ చూపిస్తుందన్నారు స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయకపోవడం వల్ల పై చదువులకు పేద విద్యార్థులు వెళ్లాలంటే కళాశాల యజమాన్యం రియంబర్స్మెంట్ కడితేనే సర్టిఫికెట్లు ఇస్తామని ఇబ్బందులకు గురి చేస్తున్నారని ప్రభుత్వానికి ఎన్నిసార్లు విన్నవించిన పట్టించుకోవట్లేదని ఆరోపించారు.ప్రభుత్వం ప్రభుత్వ విద్య బలోపేతానికి రాబోయే అసెంబ్లీ బడ్జెట్లో అధిక నిధులు కేటాయించి ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని కోరారు.ప్రభుత్వ విద్య బలోపేతానికి ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు సైనికుల పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి కుర్ర సైదా నాయక్ ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు వీరన్న,సంపత్,లోహి,ఝాన్సీ, ఎస్ఎఫ్ఐ డివిజన్ కమిటీ సభ్యులు కార్తీక్,సమీర్, హనుమంతు,వెంకటేష్,చరణ్ పాల్గొన్నారు.



## కేతకి క్షేత్రానికి పోటెత్తిన భక్తులు..!

**ఝరాసంగం,ఫ్లాష్ ఇండియా :** దక్షిణ కాశిగా ప్రసిద్ధి చెందిన ఝరాసంగం కేతకి సంగమేశ్వర స్వామి ఆలయానికి బుధవారం అమావాస్య, శ్రావణ మాసం ప్రారంభం సందర్భంగా భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఉదయం 4:30 గంటలకు నిత్య పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనం అవకాశం కల్పించారు. తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి భక్తులు ప్రత్యేక వాహనాల్లో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తుల రద్దీ అధికంగా ఉండటంతో స్వామి వారి స్పర్శ దర్శనాన్ని నిలిపివేశారు.ముందుగా భక్తులు అమృత గుండంలో పుణ్య స్నానాలు ఆచరించి, అనంతరం స్వామివారి దర్శనం కోసం క్యూ లైన్లో వేచి ఉన్నారు. దర్శనానికి సుమారు రెండు గంటల సమయం పట్టింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఈఓ శివ రుద్రప్ప ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అదేవిధంగా బర్దిపూర్ దత్తగిరి ఆశ్రమం, జ్యోతిర్లింగాలు, మచ్నూర్ రామలింగేశ్వరాలయం, కుప్పానగర్ గుబ్బడి సంగమేశ్వర ఆలయం, ఈదులపల్లి, పొట్టిపల్లి, సిద్ధేశ్వర ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## పెన్షన్లో 1.5 శాతం కోత నిలిపివేయాలి..



**నిజామాబాద్,ఫ్లాష్ ఇండియా :** ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రులతో ఒప్పందాలు చేసుకోకుండానే గత మూడు నెలలుగా పెన్షనర్ల పెన్షన్లో 1.5 శాతం కోత విధించడాన్ని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ నిజామాబాద్ జిల్లా శాఖ తీవ్రంగా ఖండించింది. బుధవారం పెన్షనర్స్ భవన్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సంఘం నాయకులు ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగులు, పెన్షనర్ల నుంచి గత మూడు నెలల్లో సుమారు రూ. 250 కోట్లను వసూలు చేసినప్పటికీ ఇప్పటికీ నగదు రహిత వైద్య సేవలు అందుబాటులోకి రాకపోవడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని సంఘం గౌరవాధ్యక్షుడు కే. రామ్మోహన్రావు ఆరోపించారు. ఆరు నెలలుగా 'ఇదిగో హెల్త్ కార్డు.. అదిగో హెల్త్ కార్డు' అంటూ పెన్షనర్లను తిప్పుతున్నారే తప్ప, ఇప్పటివరకు హెల్త్ కార్డులు జారీ చేసిన పాపాన పోలేదని జిల్లా అధ్యక్షుడు సిర్ప హనుమాండ్లు ప్రభుత్వ తీరును విమర్శించారు.



# కెప్టెన్సీ ఇస్తేనే వస్తా..

ఐపీఎల్ 2027 ట్రేడింగ్ ప్రారంభానికి ముందే ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా భవిష్యత్తుపై నెట్టింట ఊహాగానాలు షికారు చేస్తున్నాయి. ఐదు-సార్లు ఛాంపియన్‌గా నిలిచిన ముంబై ఇండియన్స్‌లో 2024లో తిరిగి చేరిన హార్దిక్‌కు జట్టు యాజమాన్యం కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించిన సంగతి తెలిసిందే. అయితే, ఆ సీజన్‌లో జట్టు తీవ్ర నిరాశాజనకమైన ప్రదర్శన చేయడంతో వచ్చే సీజన్‌కు ముంబై అతనితో కొనసాగే అవకాశం లేదని వార్తలు వస్తున్నాయి. దీంతో హార్దిక్‌ను ట్రేడ్ చేసుకునేందుకు చెన్నై సూపర్ కింగ్స్ ముందు వరుసలో ఉ ందనే ప్రచారంతో పాటు ఢిల్లీ క్యాపిటల్స్, కోల్‌కతా నైట్ రైడర్స్ కూడా ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది. ఈ రేసుల మధ్య ఇండియన్ ఎక్స్‌ప్రెస్ ఒక సంచలన విషయాన్ని వెలుగులోకి తెచ్చింది. హార్దిక్ తన పాత ఫ్రాంచైజీ గుజరాత్ టైటాన్స్‌కే తిరిగి వెళ్లేందుకు ఆ జట్టు మేనేజ్‌మెంట్‌తో చర్చలు జరిపినట్లు సమాచారం. గుజరాత్ ప్రస్తుత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ కూడా హార్దిక్ పునరాగమనానికి మొగ్గు చూపినప్పటికీ, ఈ డీల్ మాత్రం కార్యరూపం దాల్చలేదు. దీనికి కారణం హార్దిక్ విధించిన షరతేనని తెలుస్తోంది. మళ్లీ కెప్టెన్సీ ఇస్తేనే జట్టులోకి వస్తానని హార్దిక్ గుజరాత్ టైటాన్స్ ముందుకు ప్రతిపాదన ఉంచగా, ఆ ష-రతును అంగీకరించేందుకు ఫ్రాంచైజీ నిరాకరించడంతో ట్రేడ్ ఆగిపోయిందట. ఈ అంశంపై గుజరాత్ టైటాన్స్ ప్రతినిధులు స్పందించడానికి నిరాకరించగా, హార్దిక్ మేనేజర్ మాత్రం ఈ వార్తలను ఖండించారు. హార్దిక్ ఏ ఫ్రాంచైజీతోనూ నేరుగా ట్రాన్స్‌ఫర్ లేదా ట్రేడ్ విషయమై మాట్లాడలేదని, ఎలాంటి చర్చలైనా కేవలం ముంబై ఇండియన్స్ యాజమాన్యం ద్వారానే జరుగుతాయని ఆయన స్పష్టం చేశారు. కెరీర్ ప్రారంభంలో ముంబై ఇండియన్స్‌కే ఆడిన హార్దిక్, 2022లో గుజరాత్ టైటాన్స్ కొత్తగా వచ్చినప్పుడు ఆ జట్టుకు కెప్టెన్‌గా మారి తొలి ఏడాదిలోనే ట్రోఫీ అందించాడు.

ఆ తర్వాతి సీజన్‌లో కూడా గుజరాత్‌ను ఫైనల్స్ వరకు తీసుకెళ్లాడు. అయితే, 2023 వన్డే ప్రపంచకప్ ఫైనల్ వరకు టీమిండియాను నడిపించిన రోహిత్ శర్మను తప్పించి, 2024లో ట్రేడ్ ద్వారా తిరిగి ముంబైకొచ్చిన హార్దిక్‌కు ముంబై యాజమాన్యం కెప్టెన్సీ ఇచ్చింది. ఈ నిర్ణయం ముంబై అభిమానులను తీవ్రంగా నిరాశపరచగా, ఆ సీజన్‌లో జట్టు ప్లేఆఫ్స్ కూడా చేరకపోవడంతో అభిమానుల అసంతృప్తి మరింత పెరిగింది.

# బంగ్లాదేశ్‌కు భారీ షాక్?




భారత్, అఫ్గానిస్థాన్ జట్ల మధ్య మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌కు షెడ్యూల్ ఖరారు అయింది. సెప్టెంబర్‌లో భారత పర్యటనకు టీమిండియా రానున్నట్లు అఫ్గానిస్థాన్ క్రికెట్ బోర్డు (ఏసీబీ) ధ్రువీకరించింది. సెప్టెంబర్ 13 నుంచి 17 వరకు టీ20 సిరీస్ జరగనుంది. మూడు మ్యాచ్‌లూ ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలోనే జరగనున్నాయి. భారత పర్యటనకు సంబంధించిన షెడ్యూల్‌ను తమ వాణిజ్య భాగస్వాములు, సంబంధిత సంస్థలకు ఏసీబీ లేఖ ద్వారా తెలియజేసింది. భారత్, అఫ్గానిస్థాన్ టీ20 సిరీస్‌లో తొలి మ్యాచ్ సెప్టెంబర్ 13న జరగనుంది. రెండో టీ20 సెప్టెంబర్ 15న, మూడో టీ20 సెప్టెంబర్ 17న జరగనుంది. మూడు మ్యాచ్‌లకు ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియమే వేదిక కానుంది. ఈ సిరీస్‌కు సంబంధించిన తేదీలు, వేదికలను బీసీసీఐతో చర్చించి ఖరారు చేసినట్లు అఫ్గానిస్థాన్ క్రికెట్ బోర్డు తెలిపింది. సెప్టెంబర్ 13 నుంచి 17 వరకు సిరీస్ జరగనున్నట్లు ఏసీబీ సీఈఓ నసీబ్ ఖాన్ ధ్రువీకరించారు. బీసీసీఐతో తేదీలు, వేదికలపై అంగీకారం కుదిరిందని కూడా వెల్లడించారు. అయితే ఈ సిరీస్‌పై అభిమానులకు అధికారిక ప్రకటన ఇంకా వెలువడాల్సి ఉందని ఏసీబీ స్పష్టం చేసింది. మీడియా హక్కుల సంస్థలు, ఇతర భాగస్వాములు ముందస్తు ఏర్పాట్లు చేసుకునేందుకు షెడ్యూల్‌ను అధికారికంగా తెలియజేసినట్లు పేర్కొంది. ఈ సిరీస్‌లో మరో ఆసక్తికర అంశం కూడా ఉంది. విదేశీ క్రికెట్ బోర్డు భారత్‌లోనే టీమిండియాకు ఆతిథ్యం ఇవ్వడం ఇదే తొలిసారి. సాధారణంగా భారత జట్టు స్వదేశంలో ఆడే సిరీస్‌లను బీసీసీఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తుంటుంది. అయితే ఈసారి అఫ్గానిస్థాన్ క్రికెట్ బోర్డు ఈ సిరీస్‌కు ఆతిథ్య బాధ్యతలు తీసుకుంది. అఫ్గానిస్థాన్‌తో సిరీస్ ఖరారు కావడంతో సెప్టెంబర్‌లో బంగ్లాదేశ్‌తో భారత్ సిరీస్ జరిగే అవకాశాలు పూర్తిగా తగ్గినట్లు తెలుస్తోంది. సెప్టెంబర్ 1 నుంచి 13 వరకు భారత్‌తో ఆరు మ్యాచ్‌ల వైట్‌బాల్ సిరీస్ నిర్వహించాలని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు భావించినట్లు సమాచారం. అయితే తాజా పరిణామాల నేపథ్యంలో ఆ సిరీస్‌పై అనిశ్చితి నెలకొంది. ప్రస్తుతం భారత్-అఫ్గానిస్థాన్ మూడు టీ20ల సిరీస్‌కు తేదీలు, వేదికలు ఖరారయ్యాయి. సెప్టెంబర్ 13న ఢిల్లీలో తొలి టీ20తో ఈ సిరీస్ ప్రారంభం కానుండటంతో.. ఇరు జట్ల అభిమానుల్లో ఆసక్తి పెరిగింది. అధికారిక ప్రకటన వెలువడిన తర్వాత జట్ల వివరాలు, మ్యాచ్ సమయాలపై మరింత స్పష్టత రానుంది.



# విరాట్, రోహిత్‌కి కూడా సాధ్యం కాలేదు..

శ్రీలంకతో గాల్ వేదికగా శనివారం నుంచి ప్రారంభం కానున్న రెండు టెస్టుల సిరీస్‌లో భారత జట్టును యువ స్టార్ శుభ్‌మన్ గిల్ నడిపించబోతున్నాడు. ప్రస్తుతం అద్భుతమైన ఫామ్‌లో ఉన్న గిల్‌కు ఈ సిరీస్ ద్వారా వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ చరిత్రలో తన పేరును సువర్ణాక్షరాలతో లిఖించుకునే సువర్ణావకాశం లభించింది. ఈ రెండు మ్యాచ్‌లలో గిల్ మరో 157 పరుగులు చేస్తే చాలు, డబ్ల్యూటీసీ చరిత్రలోనే 3000 పరుగుల మార్కును అందుకున్న తొలి భారతీయ బ్యాటర్‌గా సరికొత్త చరిత్ర సృష్టిస్తాడు. ఇప్పటికే డబ్ల్యూటీసీలో గిల్ పేరిట అద్భుత రికార్డు ఉంది. 40 మ్యాచ్‌ల్లోని 73 ఇన్నింగ్స్‌లలో 43.07 సగటుతో 2843 పరుగులు సాధించాడు. ఇందులో 10 సెంచరీలు, 8 అర్ధసెంచరీలు ఉన్నాయి. భారత బ్యాటర్లలో ప్రస్తుతం ఎవరూ కూడా గిల్ రికార్డుకు సమీపంలో లేకపోవడం విశేషం. ఈ జాబితాలో వికెట్ కీపర్ బ్యాటర్ రిషబ్ పంత్ 40 మ్యాచ్‌ల్లో 2780 పరుగులతో (బెస్ట్ స్కోరు: 146, సగటు: 41.49, 6 సెంచరీలు, 16 అర్ధసెంచరీలు) రెండో స్థానంలో ఉండగా, మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ 40 మ్యాచ్‌ల్లో 2716 పరుగులతో (బెస్ట్ స్కోరు: 212, సగటు: 41.15, 9 సెంచరీలు) మూడో స్థానంలో ఉన్నాడు. ఇక ఆ తర్వాతి స్థానాల్లో విరాట్ కోహ్లీ 46 మ్యాచ్‌ల్లో 2617 పరుగులు (బెస్ట్ స్కోరు: 254, సగటు: 35.36, 5 సెంచరీలు, 11 అర్ధసెంచరీలు), రవీంద్ర జడేజా 48 మ్యాచ్‌ల్లో 2610 పరుగులతో (బెస్ట్ స్కోరు: 175, సగటు: 42.78, 5 సెంచరీలు, 18 అర్ధసెంచరీలు) ఉన్నారు. ప్రపంచ వ్యాప్తంగా చూస్తే మాత్రం డబ్ల్యూటీసీలో ఇంగ్లాండ్ కెప్టెన్ జో రూట్ 6651 పరుగులతో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. బ్యాటర్‌గానే కాకుండా కెప్టెన్‌గా కూడా గిల్ ఓ అరుదైన ఘనతకు అత్యంత చేరువలో ఉన్నాడు. ప్రస్తుత 2025-27 డబ్ల్యూటీసీ సైకిల్‌లో భారత కెప్టెన్‌గా గిల్ 8 మ్యాచ్‌లలోనే 950 పరుగులు చేశాడు. శ్రీలంకపై కేవలం మరో 50 పరుగులు జోడిస్తే, ఒకే డబ్ల్యూటీసీ సైకిల్‌లో 1000 పరుగులు పూర్తి చేసిన తొలి భారతీయ కెప్టెన్‌గా గిల్ నిలుస్తాడు. గతంలో విరాట్ కోహ్లీ (2019-21లో 934 పరుగులు), రోహిత్ శర్మ (2023-25లో 864 పరుగులు) కెప్టెన్లుగా ఉన్న సమయంలో ఈ మైలురాయిని అందుకోలేకపోయారు. ఇక ఓవరాల్‌గా ఒకే డబ్ల్యూటీసీ సైకిల్‌లో 1000 ప్లస్ పరుగులు చేసిన భారత ప్లేయర్ల జాబితాను పరిశీలిస్తే.. ఇప్పటివరకు అజింక్య రహానే, రోహిత్ శర్మ, యశస్వి జైస్వాల్ మాత్రమే ఈ ఫీట్ సాధించారు. శ్రీలంక సిరీస్‌లో ఆ ఒక్క 50 పరుగుల మార్కును దాటితే, ఈ మైలురాయిని చేరుకున్న నాలుగో భారతీయ బ్యాటర్‌గా గిల్ సరికొత్త అధ్యాయాన్ని లిఖిస్తాడు.

# బిజినెస్



# అదానీపై అమెరికాలో క్రిమినల్ కేసు శాశ్వతంగా క్లోజ్

అదానీ గ్రూప్‌కు అమెరికాలో భారీ ఊరట లభించింది. గౌతమ్ అదానీ, ఆయన మేనల్లుడు సాగర్ అదానీ, అదానీ గ్రీన్ ఎనర్జీ మాజీ సీఈఓ వినీత్ జైన్‌పై ఉన్న లంచం, సెక్యూరిటీస్ ఫ్రాడ్‌కు సంబంధించిన క్రిమినల్ కేసును న్యూయా-ర్క్‌లోని ఈస్టర్న్ డిస్ట్రిక్ట్ కోర్టు 'విత్ ప్రిజుడిస్'తో కొట్టివేసింది. అంటే ఈ క్రిమినల్ అభియోగాలను భవిష్యత్తులో మళ్లీ దాఖలు చేయలేరు. 2024, నవంబర్‌లో మొదలైన ఈ కేసులో, భారత ప్రభుత్వ అధికారులకు సుమారు 250 మిలియన్ డాలర్ల లంచాలు ఇచ్చి భారీ సౌర విద్యుత్ కాంట్రాక్టులు దక్కించుకున్నారని, అమెరికా మార్కెట్లలో రుణాలు, బాండ్ల ద్వారా 3 బిలియన్ డాలర్లకు పైగా నిధులు సమీకరించే సమయంలో పెట్టుబడిదారులను తప్పుదోవ పట్టించారని అమెరికా ప్రాసిక్యూటర్లు ఆరోపించారు. అదానీ గ్రూప్ ఈ ఆరోపణలను ఖండించింది. కేసును కొనసాగించడం ఇకపై న్యాయ ప్రయోజనాలకు ఉపయోగపడదని ట్రంప్ ప్రభుత్వం వాదిస్తూ, ఆరోపణలకు సంబంధించిన కార్యకలాపాలు ప్రధానంగా భారత్‌లో జరగడం, అధికార పరిధి-సాక్ష్యాల సమస్యలు, భారత అధికారులు ఈ అంశాన్ని పరిశీలించడం వంటి కారణాలను చూపింది. అయితే, కేసును కొట్టివేయడానికి ముందు జడ్జి నికోలస్ గరౌఫిస్ ప్రభుత్వాన్ని మరిన్ని వివరాలు ఇవ్వాలని కోరారు. మరోవైపు, అమెరికా ఎస్ఈసీతో ఉన్న ప్రత్యేక సివిల్ కేసులో గౌతమ్ అదానీ 6 మిలియన్ డాలర్ల జరిమానా చెల్లించేందుకు అంగీకరించారు. మొత్తంగా, క్రిమినల్ కేసు శాశ్వతంగా ముగియడం అదానీ గ్రూప్‌కు అంతర్జాతీయ వ్యాపారం, పెట్టుబడిదారుల విశ్వాసం, భవిష్యత్ నిధుల సమీకరణ పరంగా కీలక ఊరటగా నిలవనుంది.

# ఏఐ మోసాలకు ఏఐతోనే చెక్



సైబర్ మోసగాళ్లు మారుతున్న వేగానికి పాత రూల్‌బేస్డ్ వ్యవస్థలు సరిపోవడం లేదు, వారికి చెక్ పెట్టాలంటే ఏఐతోనే ఏఐని ఎదుర్కోవాల్సి ఉంటుందని ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా అన్నారు. మంగళవారం జరిగిన 'ఫీబాక్ 2026' సదస్సులో ఆయన ప్రసంగిస్తూ, సాంప్రదాయ నియమాల ఆధారిత వ్యవస్థల కంటే వేగంగా మారే ఏఐ-ఆధారిత మోసాలను అరికట్టడానికి బ్యాంకింగ్‌లో 'రియల్ టైమ్' ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), మెషిన్ లెర్నింగ్ మోడళ్లు అత్యంత కీలకమని స్పష్టం చేశారు. 1990ల నాటి ఆర్థిక సరళీకరణ, 2010ల నాటి డిజిటలైజేషన్ ఏ స్థాయిలో మార్పు తెచ్చాయో, ఈ దశాబ్దంలో ఏఐ కూడా బ్యాంకింగ్ వ్యవస్థను అదే రీతిలో పునర్నిర్మిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఆధార్, యూపీఐ వంటి డిజిటల్ మౌలిక సదుపాయాలు భారత్‌కు అనుకూల అంశాలని, ఏఐ సహాయంతో బ్యాంకుల నిర్వహణ వ్యయాన్ని తగ్గించడంతో పాటు క్రెడిట్ హిస్టరీ లేని వర్గాలకు కూడా రుణాలు అందించవచ్చని ఆయన వివరించారు. ఇదే సమయంలో ఏఐ వల్ల వచ్చే ప్రమాదాలను నివారించేందుకు ఆర్‌బీఐ ఒక కమిటీ ద్వారా నైతిక, బాధ్యతాయుతమైన ఏఐ వినియోగ ఫ్రేమ్‌వర్క్ రూపొందించిందని, అలాగే 203కి పైగా అప్లికేషన్లను ఆటోమేట్ చేస్తూ వ్యాపారాలను సులభతరం చేశామని గవర్నర్ వెల్లడించారు.



# బంగారానికి డిమాండ్..

బంగారం ధరలు అంతకంతకూ పెరుగుతున్నాయి. మార్కెట్ ఒడిదుడుకుల నుంచి రక్షణ కోసం చైనా సెంట్రల్ బ్యాంకు సహా పలు వ్యవస్థాగత ఇన్వెస్టర్లు బంగారం వైపు మొగ్గు చూపుతుండటంతో కొంత వరకూ డిమాండ్ పెరుగుతోందని నిపుణుల చెబుతున్నారు. భారత్‌లో కూడా బంగారం తాజాగా రెండు నెలల గరిష్ఠానికి చేరుకుంది. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, నేడు (ఆగస్టు 12) ఉదయం 6.30 గంటల సమయంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,53,850గా ఉంది. 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,41,010గా, 18 క్యారెట్లు 10 గ్రాముల బంగారం ధర రూ.1,15,380ల వద్ద కొనసాగుతోంది.

# ఈవీ సబ్సిడీ మరో మూడేళ్లు పొడిగించిన కేంద్రం



భారత ఎలక్ట్రిక్ వాహన మార్కెట్‌కు కేంద్రం మరోసారి బూస్ట్ ఇచ్చింది. పీఎం ఈ-డ్రైవ్ పథకాన్ని 2028, మార్చి 31 వరకు పొడిగిస్తూ భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ నిర్ణయం తీసుకుంది. మొత్తం రూ. 11,900 కోట్ల వ్యయంతో అమలయ్యే ఈ పథకం ఈవీల కొనుగోళ్లను పెంచడంతో పాటు ఛార్జింగ్ మౌలిక సదుపాయాలు, దేశీయ తయారీ వ్యవస్థను బలోపేతం చేయడంపై దృష్టి పెడుతోంది. ముఖ్యంగా ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలకు 2025, ఏప్రిల్ 1 నుంచి 2028, మార్చి 31 వరకు కొనుగోలు ప్రోత్సాహకం కొనసాగుతుంది. ప్రతి కిలోవాట్ అవర్ బ్యాటరీ సామర్థ్యానికి రూ. 2,500 చొప్పున, ఒక్కో వాహనానికి గరిష్ఠంగా రూ. 5,000 వరకు సబ్సిడీ లభిస్తుంది. అయితే ఈ ప్రయోజనం రూ. 1.5 లక్షల వరకు ఎక్స్-ఫ్యాక్టరీ ధర ఉన్న అర్హత కలిగిన ఈ-టూ వీలర్లకే వర్తిస్తుంది. ఈ పథకం ద్వారా గరిష్ఠంగా 45.79 లక్షల ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలకు మద్దతు ఇవ్వనున్నారు. ఇందుకోసం రూ. 2,767 కోట్లను కేటాయించారు. 2024-25లో ఉన్న కిలోవాట్ అవర్‌కు రూ. 5,000, గరిష్ఠంగా రూ. 10,000 ప్రోత్సాహకంతో పోలిస్తే తాజా సబ్సిడీ తక్కువే. వాహనాల ధరలు తగ్గుతున్న కొద్దీ ఈ కిలోవాట్ అవర్ ఆధారిత ప్రోత్సాహకాన్ని ప్రభుత్వం సమీక్షించి మార్చే అవకాశం కూడా ఉంది. అంతేకాకుండా, నిర్ణయించిన సబ్సిడీ లేదా ఎక్స్-ఫ్యాక్టరీ ధరలో 15 శాతం, ఏది తక్కువైతే దానికే ప్రోత్సాహకం పరిమితం అవుతుంది. అన్ని విభాగాలకు 2028, మార్చి 31 తుది గడువు ఉండగా, భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ లేదా ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ ఏజెన్సీకి క్లెయిమ్‌లు సమర్పించేందుకు చివరి తేదీ 2027, డిసెంబర్ 31గా నిర్ణయించారు.

# వన్ ప్లస్ పై రూ.11 వేల డిస్కౌంట్..ధర, ఫీచర్స్ ఇవే!



వన్ ప్లస్ నార్డ్ 6 మొబైల్ ఫోన్లపై అదిరిపోయే ఆఫర్ ప్రకటించింది కంపెనీ. ఇండిపెండెన్స్ డే సేల్ 2026లో భాగంగా ఈ మొబైల్ పై దాదాపు రూ.11 వేల వరకు డిస్కౌంట్ లభించనుంది. ఈ మె-ాబైల్ లాంచ్ అయినప్పుడు రూ.52, 999 ఫిక్స్ చేశారు. ఇదే మొబైల్ పై నేరుగా రూ.8500 డిస్కౌంట్ తో రూ.44,499కి వస్తోంది. అలాగే ఎంపిక చేసిన బ్యాంకు కార్డులు, క్రెడిట్ కార్డు EMI లావాదేవీలపై అదనంగా రూ.2500 ఇన్ స్టంట్ డిస్కౌంట్ లభిస్తోంది. యాక్సిస్ బ్యాంకు వినియోగదారులకు కూడా 2500 డిస్కౌంట్ ఉంటుంది. అంటే ఈ రెండు ఆఫర్లు కలిపి రూ.11 వేల డిస్కౌంట్ తో ఈ ఫోన్ రూ. 41,499కి వస్తుంది. One-Plus Nord 6 మొబైల్ 6.78 ఇంచుల డిస్ ప్లే కలిగి ఉంటుంది. 9000mAh battery ఉంటుంది. 80W ఫాస్ట్ ఛార్జర్ సపోర్ట్ చేయనుంది. 50MP Sony OIS మెయిన్ కెమెరా, 32MP సెల్ఫీల కెమెరా అందిస్తున్నారు.

# 'ఇరుముడి' ట్రైలర్ రిలీజ్‌కి ముహూర్తం ఫిక్స్




మాస్ మహారాజా రవితేజ ప్రస్తుతం 'ఇరుముడి' చిత్రంలో హీరోగా నటిస్తున్నారు. ఈ సినిమాను ఆగస్టు 21న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే మూవీ నుంచి పలు ప్రచార చిత్రాలను మేకర్స్ విడుదల చేయగా, వాటికి అద్భుతమైన స్పందన లభించింది. గత కొంతకాలంగా వరుస అపజయాలతో డీలా పడిపోయిన రవితేజ ఈ సినిమాతో సూపర్ కమ్‌బ్యాక్ ఇస్తారని ఆయన అభిమానులతో పాటు సాధారణ ప్రేక్షకులు కూడా గట్టి నమ్మకంతో ఉన్నారు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు ఆకట్టుకోవడంతో ట్రైలర్‌పై కూడా భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా 'ఇరుముడి' ట్రైలర్ విడుదలకు సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడింది. ఈ సినిమా ట్రైలర్‌ను నేడు సాయంత్రం 6 గంటల 03 నిమిషాలకు విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ట్రైలర్ ప్రేక్షకులను ఆకట్టుకుంటే సినిమాపై అంచనాలు మరింత పెరిగే అవకాశం ఉంది. ఈ చిత్రంలో ప్రియ భవాని శంకర్ హీరోయిన్‌గా నటించగా, శివ నిర్వాణ దర్శకత్వం వహిస్తున్నారు. సాయి కుమార్, బేబీ నక్షత్ర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. జీబీ ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్‌పై వై. రవిశంకర్, నవీన్ యెర్నేని నిర్మిస్తున్నారు.

# ఇంత స్ట్రాంగ్‌గా ఎలా మారింది?

హాలీవుడ్ ప్రాజెక్ట్స్‌తో పాటు ప్రియాంకా ఇండియన్ సినిమాపై కూడా ఫోకస్ పెట్టింది. ఎస్.ఎస్. రాజమౌళి దర్శకత్వంలో మహేష్ బాబు హీరోగా తెరకెక్కుతున్న భారీ గ్లోబల్ యాక్షన్ అడ్వెంచర్ 'వారణాసి'లో ప్రియాంకా కీలక పాత్రలో నటిస్తోంది. 'మందాకిని' అనే పాత్రలో ఆమె కనిపించనుంది. గ్లోబల్ వైడ్ ట్రావెల్ చేసే కథ, రాజమౌళి మార్క్ మేకింగ్, మహేష్ బాబు--ప్రియాంకా కాంబినేషన్ ఇవన్నీ కలిపి ఈ సినిమాపై అంచనాలను పెంచుతున్నాయి. అంటే హాలీవుడ్‌లో గ్లోబల్ స్టార్‌గా ఉన్న ప్రియాంకా ఇప్పుడు ఇండియన్ సినిమా నుంచి కూడా గ్లోబల్ స్కేల్‌లోనే తన జర్నీ కంటిన్యూ చేస్తోంది. ప్రియాంకా కెరీర్‌ను చూస్తే... ఒక్క సినిమా తో వచ్చిన గ్లోబల్ క్రేజ్ కాదు. 'సీటాడెల్'లాంటి సిరీస్ లతో ఇంటర్నేషనల్ ఆడియన్స్‌కు మరింత చేరువైన ప్రియాంకా... ఇప్పుడు సినిమాలు, వెబ్ సిరీస్‌లు, యాక్షన్, సైన్స్ ఫిక్షన్ అంటూ వరసగా డిఫరెంట్ జానర్స్‌ను ఎంచుకుంటుంది. సేమ్ టైమ్ ఇండియన్ సినిమాను కూడా వదిలిపెట్టకుండా రాజమౌళి లాంటి దర్శకుడితో భారీ ప్రాజెక్ట్ తో పాటు , ఫరాన్ అక్తర్ చేయబోయే జీలే జరా, హృతిక్ రోషన్ కాంబోలో క్రిష్ 4 లాంటి బాలీవుడ్ సినిమాలు కూడా చర్చల్లో ఉన్నాయి. మరి ఈ వరస బిగ్ ప్రాజెక్ట్స్ ఆమెను గ్లోబల్ స్టార్‌గా మరింత ఎత్తుకు తీసుకెళ్తాయా? అన్నదే ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.







టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత తాజాగా 'మా ఇంటి బంగారం' చిత్రంలో ప్రధాన పాత్రలో నటించిన విషయం తెలిసిందే. మంచి అంచనాల నడుమ విడుదలైన ఈ చిత్రం దాదాపు రూ.100 కోట్లకు పైగా వసూళ్లు సాధించి భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. తెలుగులో ఇప్పటివరకు వచ్చిన లేడీ ఓరియెంటెడ్ చిత్రాల్లో అత్యధిక వసూళ్లు సాధించిన సినిమాగా నిలిచినట్లు మూవీ బృందం అధికారికంగా ప్రకటించింది. బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లు రాబట్టిన ఈ చిత్రం ఇప్పటికే తెలుగు భాషలో ఓటీటీలో అందుబాటులోకి వచ్చింది. తాజాగా హిందీ ప్రేక్షకులను అలరించేందుకు కూడా సిద్ధమైంది. ఈ మూవీ హిందీ వెర్షన్ డిజిటల్ హక్కులను 'సోనీ లివ్' సంస్థ సొంతం చేసుకుంది. ఇందులో భాగంగా త్వరలోనే ఈ చిత్రాన్ని తమ డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లో స్ట్రీమింగ్ చేయనున్నట్లు సోనీ లివ్ అధికారికంగా ప్రకటించింది. మరి హిందీ ప్రేక్షకులను 'మా ఇంటి బంగారం' ఏ స్థాయిలో అలరిస్తుందో చూడాలి. నందిని రెడ్డి దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి సంతోష్ నారాయణన్ సంగీతం అందించారు. గుల్షన్ దేవయ్య, దిగంత్ మంచాలే, గౌతమి, శ్రీముఖి తదితరులు కీలక పాత్రల్లో నటించారు. ట్రలాలా మూవింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై రాజ్ నిడిమోరు, సమంత రూత్ ప్రభు, హిమాంక్ దువ్వూరు ఈ చిత్రాన్ని నిర్మించారు.

## 'ఈతా' మూవీ విడుదల వాయిదా..




బాలీవుడ్ సెన్సేషన్ శ్రద్ధా కపూర్ ప్రధాన పాత్రలో నటిస్తున్న మోస్ట్ ప్రెస్టీజియస్ బయోపిక్ మూవీ 'ఈతా' . మహారాష్ట్రకు చెందిన ప్రముఖ లావణి, జానపద నృత్య కళాకారిణి విఠాబాయ్ నారాయణగాంకర్ జీవిత విశేషాల ఆధారంగా ఈ చిత్రాన్ని దర్శకుడు లక్ష్మణ్ ఉటేకర్ తెరకెక్కిస్తున్నారు. దినేష్ విజయన్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ సినిమాలో వర్సటైల్ నటుడు రణదీప్ హుడా ఒక కీలక పాత్ర పోషిస్తున్నారు. అయితే ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈ చిత్రం ఆగస్టు 28న ప్రేక్షకుల ముందుకు రావాల్సి ఉంది. కానీ పలు కారణాల వల్ల సినిమా విడుదలను వాయిదా వేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. తాజాగా ఈ మూవీ కొత్త రిలీజ్ డేట్‌ను ఖరారు చేస్తూ, డిసెంబర్ 4న థియేటర్లలోకి తీసుకువస్తున్నట్లు తెలిపారు. ఈ అప్‌డేట్‌ను శ్రద్ధా కపూర్ తన సోషల్ మీడియా ఖాతా ద్వారా వెల్లడిస్తూ, థియేటర్లలో తుఫానును ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని ఒక పవర్‌ఫుల్ క్యాప్షన్ జత చేశారు.

# 'డ్రాగన్' షూటింగ్‌కు బ్రేక్..



మరో టాలీవుడ్ స్టార్ హీరోకి గాయం కావడంతో సినీ ప్రియులు, అభిమానులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. గ్లోబల్ స్టార్ జూనియర్ ఎన్టీఆర్ తీవ్ర భుజం నొప్పితో బాధపడుతుండటంతో, బుధవారం హైదరాబాద్‌లోని కిమ్స్ (KIMS) ఆసుపత్రిలో ఆయన కుడి భుజానికి సర్జరీ జరగనుంది. గతకొన్ని రోజులుగా భుజం నొప్పితో బాధపడుతున్న ఎన్టీఆర్.. వైద్యుల సూచన మేరకు షూటింగ్‌లకు విరామం ఇచ్చి విశ్రాంతి తీసుకుంటున్నారు. ప్రస్తుతం ఆయన స్టార్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'డ్రాగన్' (వర్కింగ్ టైటిల్) చిత్రంలో నటిస్తున్నారు. ఈ సర్జరీ అనంతరం ఆయన కొద్దిరోజుల పాటు విశ్రాంతి తీసుకోనుండటంతో, తదుపరి షూటింగ్ షెడ్యూల్ కాస్త ఆలస్యమయ్యే అవకాశముంది.

**స్టార్ హీరోల వరుస గాయాలు..**

ఇటీవలి కాలంలో టాలీవుడ్‌లో పలువురు అగ్ర నటులు వరుసగా షూటింగ్‌లలో గాయపడటం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే పవన్ కల్యాణ్, రామ్ చరణ్, నందమూరి బాలకృష్ణ వరుణ్ తేజ్ వంటి హీరోలు వేర్వేరు చిత్రాల షూటింగ్‌లో గాయపడి సర్జరీలు లేదా వైద్య చికిత్సలు పొందిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఎన్టీఆరు కూడా సర్జరీ అని తెలియడంతో నందమూరి అభిమానులు ఆయన త్వరగా కోలుకోవాలని సోషల్ మీడియా వేదికగా ఆకాంక్షిస్తున్నారు.

# ఇన్ స్టాలో త్రిష సంచలన పోస్ట్.. విజయ్ భార్యను ఉద్దేశించేనా?

తమిళనాట హీరోయిన్ త్రిష వ్యవహారం తరచూ హాట్ టాపిక్ గా మారుతోంది. సీఎం విజయ్‌తో ఆమె ప్రేమలో ఉన్నారనే వార్తలతో త్రిష చాలా కాలంగా ఏదో ఒక విధంగా వార్తల్లో నిలుస్తున్నారు. ఆమె ఏం చేసినా జనాలు ఎంతో ఆసక్తి చూపిస్తున్నారు. తాజాగా మరోసారి ఆమె ఇన్ స్టాగ్రామ్ పోస్ట్ వల్ల వార్తల్లో నిలిచారు. త్రిష తన ఇన్ స్టాగ్రామ్‌లో ఓ క్రిప్టిక్ పోస్టును షేర్ చేయగా అది విజయ్ భార్య సంగీత గురించే అని ప్రచారం జరుగుతోంది. పోస్టులో త్రిష.. ఈ వయసులో అనవసర డ్రామాలు సిగ్గుచేటు అని పేర్కొన్నారు. వెళ్లి ఏదైనా పనిచేసుకుని డబ్బు సంపాదించుకుని ప్రశాంతంగా బతకాలని సూచించారు.మరో ఇన్ స్టా స్టోరీలో.. ఒకప్పుడు ప్రార్థించిన దానిని జీవితంలో పొందడం ఎంత అదృష్టం.. అంటూ పేర్కొన్నారు. ప్రస్తుతం త్రిష ఇన్ స్టాస్టోరీలపై చర్చ మొదలైంది. ఇటీవల విజయ్ భార్య సంగీత తన విడాకుల పిటిషన్ వెనక్కి తీసుకున్న సంగతి తెలిసిందే. దీంతో విజయ్ సంగీత మళ్లీ కలిసిపోయారా అనే అనుమానాలు మొదలయ్యాయి. ఈ క్రమంలో సంగీతను ఉద్దేశించే త్రిష మొదటి స్టోరీ పెట్టిందనే ప్రచారం జరుగుతోంది. ఇక రెండవ స్టోరీ విజయ్ తన వాడే అని చెప్పేందుకు పెట్టిందని కూడా ప్రచారం జరుగుతోంది.




# కెరీర్ పాఠాలు వెల్లడించిన రెజీనా

తన మొదటి తెలుగు చిత్రం 'శివ మనసులో శ్రుతి' (2012) సమయానికి నటన గురించి, ఇండస్ట్రీ రూల్స్ గురించి తనకు ఏమీ తెలియదని రెజీనా చెప్పారు. "ఆ సమయంలో షూటింగ్ కోసం స్కూల్‌కు వారాల తరబడి సెలవులు పెట్టాల్సి వచ్చేది. నా పాఠాలు మిస్ కాకుండా మా అమ్మ సెట్‌లోనే కూర్చుని నా కోసం నోట్స్ రాసేది.ప్రొడక్షన్ ఫుడ్ కాకుండా బయటి నుంచి ఫుడ్ ఆర్డర్ చేసుకోవచ్చని మేకప్ ఆర్టిస్ట్ చెప్పినా పర్వాలేదని అవే తినేదాన్ని" అని గుర్తుచేసుకున్నారు. అలాగే ఒకసారి రేడియో మిర్చి ఇంటర్వ్యూకి వెళ్లినప్పుడు సాధారణ సల్వార్, జీన్స్ వేసుకుని, తల కూడా సరిగ్గా ఆరబెట్టుకోకుండా వెళ్లానని, అక్కడ ఫోటోలు తీసి వెబ్‌సైట్‌లో పెట్టేసరికి చాలా డల్లుగా కనిపించానని నవ్వుతూ చెప్పారు. ఆ తర్వాతే ఒక నటిగా సొంత టీమ్‌ను, ఒక ప్రత్యేక ఇమేజ్‌ను ఏర్పాటు చేసుకోవడం ఎంత ముఖ్యమో అర్థమైందని తెలిపారు. ఈ రోజుల్లో చూస్తున్న పర్సెప్షన్ ఇంజనీరింగ్ లాంటిది కాకపోయినా, మంచి పాత్రలు రావాలన్నా, కెరీర్‌లో ఎదగాలన్నా సమాజంలో మన గురించి ఒక మంచి ఇమేజ్ ఉండటం అవసరమని ఆ అనుభవాల ద్వారా తెలుసుకున్నానని రెజీనా వెల్లడించారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి.




Edited, Printed, Published & Owned by KOMARAJU SRINIVASULU and Printed at Ramu Graphics, Shop No:5,Near Clock Tower Church Compound, Nalgonda District (T.S.), Published From: KOMARAJU SRINIVASULU, Village: Anthaiah Gudem, Post: Duppalapally, Mandal: Thipparthy-508247, Dist. Nalgonda, (T.S) Editor: KOMARAJU SRINIVASULU. Cell: 7730032999, E-mail: flashindiadaily@gmail.com, www.flashindianews.com, RNI No. APTEL/2010/33229